ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
శుక్రవారం 11 జులై 2025



ఎన్‌ఆర్ కాలనీ సాయిబాబా మందిరంలో ప్రత్యేక అలంకరణ



మహాబోధి సొసైటీలో బుద్ధుడికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

గురుభ్యోనమః..!

బెంగళూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి): గురుభ్యో నమః అంటూ ప్రతి చోటా గురువులను స్మరించుకోవడంతో పాటు ఇష్టదైవాలైన రాఘవేంద్ర స్వామి, షిర్డీసాయిబాబా ఆల యాలతో పాటు బుద్ధుడి మందిరాల్లోనూ గురువారం ప్రత్యేక పూజలు సాగాయి. భక్తుల రాకతో ఆలయాలు కిటకిటలాడాయి.

రాఘవేంద్ర స్వామి మఠాల్లో..

నగరంలోని ఎన్‌ఆర్ కాలనీ, జయనగర్, బసవన గుడి, రాఘవేంద్ర కాలనీలతోపాటు వివిధ ప్రాంతాలలోని రాఘవేంద్ర మఠాలలో ప్రత్యేకంగా తీర్చారు. తెల్లవారు నుంచే భక్తుల సందడి ఆరంభం కాగా మధ్యాహ్నంకు ప్రతి మందిరం లోను భక్తులతో క్రిక్కిరిసాయి.

షిర్డీసాయి మందిరాల్లో..

ఎన్‌ఆర్ కాలనీలోని సాయిమందిరంతో పాటు జేపీనగర్ పుట్టేనహళ్ళిలోని సత్యగణపతి షిర్డీ సాయి ట్రస్టు ఆలయంలోను ప్రత్యేక పూజలు హోమాలు జరిపారు. మల్లేశ్వరంతో పాటు పీణ్యాలోని సన్‌రైజ్ పాఠశాల ప్రాంగణంలోని ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి బెంగళూరు సహా రాష్ట్రంలోని అన్ని మందిరాలలోను పూజలు జరిగాయి. నగరంలోని గాంధీనగర్‌లోని మహాబోధి సొసైటీకు అనుబంధమైన మందిరంలో బౌద్ధులు గురుపూజోత్సవం జరిగింది. కాగా కోలార్ జిల్లాలోని కైవారం తాతయ్య మందిరంలో నిరంతర కార్యక్రమాలు, పూజలు జరిగాయి. ప్రతిచోట దాతలు అన్నప్రసాదం పంపిణీ చేశారు.



రాఘవేంద్ర మఠంలో భక్తుల సందడి

కేంద్రంలో అధికారంలోకి వస్తే బీజేపీ నేతలు

తీహార్ జైలుకే..!


- సుబ్బారెడ్డిని అన్యాయంగా ఇరికించారు
- ఎమ్మెల్యే ప్రదీప్‌ఈశ్వర్



బెంగళూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి): మరో నాలుగేళ్ళలో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక బీజేపీ నేతలను తీహార్ జైలులో వేస్తామని చిక్కబళ్ళాపుర ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్ మండిపడ్డారు. బెంగళూరులో గురువారం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ఎమ్మెల్యే సుబ్బారెడ్డిపై ఈడీ దాడిని తీవ్రంగా ఖండించారు. సుబ్బారెడ్డి ఎంతోకష్టపడి ఎదిగిన వారన్నారు. ప్రజల విశ్వాసం పొందేందుకు ఎన్నో ఏళ్ళు కష్టపడి బాగేపల్లిలో ఎమ్మెల్యే అయ్యారన్నారు. బీజేపీలో అందరూ నిజాయితీ పరులేనా అని ప్రశ్నించారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా కుమారుడు జైషా కంపెనీలు అన్నీ సవ్యంగానే సాగుతున్నాయా అని ప్రశ్నించారు. కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీకి ఏకంగా 17 షుగర్ ఫ్యాక్టరీలు ఉన్నాయని అవి ఐటీ, ఈడీ అధికారులకు కనిపించవా అంటూ నిలదీశారు. బీజేపీ నేతలకు ఒక్కటే చెబుతున్నానని ఎన్నివిధాల టార్గెట్ చేసినా వెనుకాడేది లేదన్నారు. 2029 ఎన్నికలలో కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బీజేపీ వారిని వెంటాడి తీహార్ జైలుకు పంపుతామని సవాల్ విసిరారు. వారు రాళ్ళతో కొడితే మేం పూలు చల్లుతామా అన్నారు. అందుకు మీడియా ప్రతినిధులు పదేళ్ళ యూపీఏ పాలనలో బీజేపీని మీరు రాళ్ళతో కొట్టారా అని అడుగగా అలా ఏం కాదని మేం ఎవరినీ టార్గెట్ చేయలేదంటూ దాటవేశారు.

నేనే సీఎం..!

- ఢిల్లీ వేదికగానే తేల్చి పడేసిన సిద్దరామయ్య
- కుర్చీ మార్పుపై ఎలాంటి ఒప్పందం లేదని వ్యాఖ్యలు
- నాయకత్వ బదిలీ అంశం ముగిసినట్టేనా..?
- డీకే శివకుమార్ వర్గీయుల్లో కలకలం



సీఎంను సత్కరిస్తున్న కాంగ్రెస్ బీసీ వర్గాల సమితి అధ్యక్షుడు అనిల్

బెంగళూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వంలో కొన్ని నెలలలోనే మార్పులు ఉంటాయని అందులో ప్రధానంగా నాయకత్వ మార్పు ఉంటుందనే అంశం కొన్ని నెలలుగా హల్‌చల్ చేస్తోంది. మేనెలతో



బెంగళూరులో ఖర్గేను కలిసిన మంత్రులు

రెండేళ్ళు పూర్తి అవుతుందని తేలిపోనుందని చర్చ జరిగింది. తాజాగా రెండున్నరేళ్ళు కావాలంటే నవంబరు దాకా ఆగాల్సి ఉంటుందనే అంశం కొనసాగింది. కానీ సీఎం సిద్దరామయ్య సరిగ్గా వారం కిందట కేబినెట్ సమావేశం ముగిశాక డీసీఎం డీకే శివకుమార్ సమక్షంలోనే ఐదేళ్ళు నేనే సీఎంగా ఉంటానని ఇందులో ఎటువంటి మార్పులు లేవన్నారు. దీంతో ఒక్కసారిగా డీకే శివకుమార్ సహా ఆయన ఆప్తులు, అనుచరులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. ఆతర్వాత డీకే శివకుమార్ కూడా ప్రత్యామ్నాయం లేకుండా మద్దతు ఇస్తున్నట్లు వ్యాఖ్యానించారు. ఇలా సాగుతుండగానే ఢిల్లీ వేదికగా సీఎం సిద్దరామయ్య తేల్చిపడేశారు. నాయకత్వ మార్పులేదని ఐదేళ్ళు నేనే సీఎంగా ఉంటానన్నారు. రెండున్నరేళ్ళకు మార్పు అనేది లేదని స్పష్టం చేశారు. ఎక్కడా అటువంటి ఒప్పందం చర్చలు జరుగలేదన్నారు. ఢిల్లీలో గురువారం ఓ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడిన తర్వాత కర్ణాటక భవన్‌లో మీడియాతో సీఎం మాట్లాడుతూ రెండున్నరేళ్ళకు అధికారం అప్పగించేలాంటి ఎటువంటి ఒప్పందం కాలేదన్నారు. కానీ మేమిద్దరం స్నేహంగా ఉన్నామన్నారు. వారం కిందట డీకే శివకుమార్ సమక్షంలోనే ఐదేళ్ళు సీఎంగా కొనసాగుతానని చెప్పాన న్నారు. ఇందుకు సంబంధించి జరుగుతున్నదంతా కేవలం ప్రచారం మాత్రమే అన్నారు. కొందరు ఎమ్మెల్యేలు మార్పు ప్రస్తావనలు తెస్తున్నారు కానీ అధిష్ఠానం ఎక్కడా చెప్పలేదన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి కుర్చీ ఖాళీ లేదన్నారు. ఎక్కడా అధికారం పంచుకునేలాంటి ఒప్పందమే జరుగలేదన్నారు. ఢిల్లీ వేదికగా సీఎం సిద్దరామయ్య వ్యాఖ్యలు ఒక్కసారిగా కాంగ్రెస్‌లో కలకలం రేపింది. సిద్దరామయ్యతో పాటే ఢిల్లీలోనే ఉన్న డీకే శివకుమార్ ఎటువంటి వ్యాఖ్యలు చేయలేదు. కాగా సిద్దరామయ్యకు ఆప్తులుగా ముద్రపడిన మంత్రులు ఉన్నఫళంగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గేను సదాశివనగర్‌లోని నివాసంలో కలిశారు. మంత్రులు మహదేవప్ప, జమీర్‌అహ్మద్, ఈశ్వర్‌ఖండ్రే, పరమేశ్వర్, దినేష్‌గుండూరావ్, శరణుప్రకాష్ పాటిల్‌లు కలిశారు. సుమారు గంటకు పైగా వారు చర్చలు జరిపారు. అయితే ఇదే సాధారణ భేటీ మినహా ప్రత్యేకత ఏదీ లేదంటూ మంత్రులు దాటవేశారు. సీఎం సిద్దరామయ్య స్పష్టమైన వ్యాఖ్యలకు అధిష్ఠానం ఏవిధంగా స్పందిస్తుందనేది వేచి చూడాల్సి ఉంది.

గుండె గుబేల్..!

- రాష్ట్రంలో గుండెపోటు మరణాలపై ఆందోళన
- హృదయ పరీక్షలకు జనం పరుగులు
- జయదేవలో పెరిగిన అవుట్ పేషెంట్లు



జయదేవ ఆసుపత్రి ఓపీ వద్ద గుమిగూడిన జనం

బెంగళూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఒక్కసారిగా గుండెపోటు కారణంగా మృతులు పెరిగారు. ఇదే ఏడాది మే నెలలో 20 నుంచి జూలై 10వ తేదీ వరకూ 41ల మంది గుండెపోటుకు గురై మృతి చెందారు. ప్రత్యేకించి హాసన్ జిల్లాలో 24మంది మృతి చెందిన విషయమై ప్రభుత్వం ప్రత్యేక కమిటీ ద్వారా విచారణలు జరిపించింది. ఇలా రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో గుండెపోట్లు పెరిగిన తరుణంలోనే వైద్య నిపుణులు ఏమాత్రం అనుమానం వచ్చినా వెంటనే ఆసుపత్రికి వెళ్ళి పరీక్షలు జరిపించుకోవాలని సూచిస్తున్నారు. కొన్ని రోజుల నుంచి వరుసగా హార్ట్‌ఎటాక్‌తో మృతి చెందుతున్న విషయమై ప్రజలలో మరింత భయానికి కారణమవుతోంది. దీంతో జయదేవ హృద్రోగ సంస్థలకు అనుబంధంగా ఉండే ఆసుపత్రులు రోజూ కిక్కిరిస్తున్నాయి. అవుట్ పేషెంట్‌ల సంఖ్య గణనీయంగా పెరిగినట్లు తెలుస్తోంది. జయదేవ ప్రధాన ఆసుపత్రి జయనగర్‌లో ఉండగా రాజాజీనగర్‌లోని ఈఎస్ఐ ఆసుపత్రిలో ప్రత్యేకంగా శాఖ పనిచేస్తోంది. ఇక మైసూరు, కలబురిగిలలోను శాఖలు ఉన్నాయి. ఇటీవల మూడు వారాలుగా అవుట్ పేషెంట్‌లు పెరిగినట్లు ఆసుపత్రి వర్గాలు ప్రకటించాయి. బెంగళూరులో గురువారం రోగులు బారులు తీరారు. ఇదే పరిస్థితి మైసూరు, కలబురగి శాఖలలోను ఉన్నట్లు తెలిసింది.



పరీక్షల కోసం వేచిచూస్తూ..

తుంగభద్ర ఎగువ కాలువకు నీటి విడుదల

- వాయనం సమర్పించిన బోర్డు అధికారులు
- సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచన



డ్యాం నుంచి ఎగువ కాలువకు విడుదలవుతున్న నీరు

హోస్పేట,జూలై10(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయం నుంచి ఎగువ కాలువ (హెచ్‌ఎల్‌సీ)కు గురువారం బోర్డు అధికారులు నీటిని విడుదల చేశారు. తుంగభద్ర బోర్డు సెక్రటరీ ఓఆర్‌కే రెడ్డి, ఎస్ఈ నారాయణ నాయక్, హెచ్‌ఎల్‌సీ ఈఈ చంద్రశేఖర్, డ్యాం స్విచ్ ఆన్ చేసి నీరు విడుదల చేశారు. అంతక ముందు బోర్డు అధికారులు డ్యాంపై పూజలు చేశారు. అనంతరం సంప్రదాయబద్ధంగా వాయనం వదిలారు. ఈ సందర్భంగా బోర్డు సెక్రటరీ ఓఆర్‌కే రెడ్డి మాట్లాడుతూ తుంగభద్ర ఎగువకాలువకు తొలుత 100 క్యూసెక్కుల నీరు వదిలి, తరువాత ప్రతి రెండు గంటలకోసారి నీరు పెంచుతామన్నారు. ఆంధ్ర, కర్ణాటక కోటా రెండు కలిపి నీరు విడుదల చేస్తామన్నారు. ఖరీఫ్ పంటల సాగుకు ఈనెల 10వ తేదీ నుంచి నవంబరు 30 వరకు దాదాపు 1300 క్యూసెక్కులు వదులుతున్నట్లు తెలిపారు. తుంగభద్ర జలాశయానికి ఎన్నడులేని విధంగా జూలై మొదటి వారంలోనే డ్యాంలో నీరు పూర్తిస్థాయిలో చేరడంతో నదికి నీటిని విడుదల చేశామన్నారు. డ్యాం గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యం 100టీఎంసీలు కాగా ప్రస్తుతం 80 టీఎంసీలకు కుదించినట్లు తెలిపారు. ప్రస్తుతం డ్యాంపై భాగంలో వర్షాలు బాగా కురుస్తున్న నేపథ్యంలో ఇన్‌ఫ్లో గణనీయంగా పెరిగిందన్నారు. రైతులు సాగు విషయంలో నీరు వృథా చేయకుండా వాడుకోవాలన్నారు. 12వ తేదీ సాయంత్రం 6గంటలకల్లా ఆంధ్ర సరిహద్దులోని 105 కిలో మిటర్ వద్దకు తుంగభద్ర జలాలు చేరుతాయన్నారు. పూజా కార్యక్రమంలో డ్యాం ఇంజనీర్లు, టీబీ డ్యాం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న బోర్డు అధికారులు

చిరుత సంచారంతో భయం..!

రాయచూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి): రాయచూరు తాలూకాలోని డి.రాంపూర్ (డొంగరాంపూర్) సమీపంలోని పరమేశ్వర గుట్టలో మరోసారి చిరుత సంచారం కలకలం రేపుతోంది. గుట్టను ఆనుకుని గుడిసె వేసుకుని నివసిస్తున్న తాయప్ప అనే రైతుకు చెందిన రెండు మేక పిల్లలను చిరుత ఎత్తుకెళ్లడంతో ఒక్కసారిగా గ్రామంలో కలకలం రేగింది. ఈ సంఘటన బుధవారం రాత్రి చోటు చేసుకోగా చిరుత సంచరిస్తున్నట్లు గుర్తులను కూడా తాము పసిగట్టినట్లు గ్రామస్థులు తెలిపారు. మే నెల చివరి వారంలో గుట్ట పై చిరుత సంచరిస్తున్నట్లు గ్రామస్థులు ఇచ్చిన సమాచారం మేరకు అటవీ శాఖ అధికారులు రెండు బోన్లను ఏర్పాటు చేయగా ఇప్పటి వరకు చిరుత ఆ బోనుకు చిక్కలేదు. దీంతో మరో సారి గ్రామాన్ని సంచరించిన అటవీ శాఖ అధికారులు చిరుతను పట్టుకునేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తామన్నారు. రెండేళ్ల మగ చిరుత గుట్ట పై సంచరిస్తున్నట్లు గతంలో గుర్తించామని బోను ఏర్పాటు చేసినా ఇప్పటి వరకు చిక్కకుండా తప్పించుకుపోయిందన్నారు. మేత కోసం వచ్చిన చిరుత రెండు మేక పిల్లలను తినేసి ఉంటుందని అంచనా వేసిన అటవి శాఖ అధికారి రాము నాయక్, త్వరలోనే చిరుతను బంధిస్తామన్నారు. అదే సమయంలో పటటిపూట నలుగురు, రాత్రి వేళ ఇద్దరు సిబ్బందిని గస్తీ కోసం ఉంచామని గ్రామస్థులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు.



గుట్టపై కనిపించిన చిరుత



సాంకేతిక హబ్‌ను పరిశీలిస్తున్న కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియా, రాష్ట్ర మంత్రి శరణప్రకాష్ పాటిల్ తదితరులు

పరిశోధనలకే ప్రాధాన్యం ఇవ్వాలి

- విద్యార్థులతో కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియా
- వీటీయూలో హబ్ అండ్ స్ట్రోక్ సెంటర్‌కు శ్రీకారం

బెంగళూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యార్థులు పరిశోధనలకే ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియా అభిప్రాయపడ్డారు. గురువారం విశ్వేశ్వరయ్య టెక్నలాజికల్ యూనివర్శిటీ అనుబంధ ప్రాంతీయ కార్యాలయం నాగరబావిలో వీటీయూ- వీఆర్ఐఎఫ్- టీసీఓఈ హబ్ అండ్ స్ట్రోక్ సెంటర్‌ను కేంద్రమంత్రి శ్రీకారం చుట్టారు. రాష్ట్ర వైద్య విద్యాశాఖ మంత్రి డాక్టర్ శరణప్రకాష్ పాటిల్‌తో పాటు వీటీయూ వీసీ డాక్టర్ ఎస్ విద్యాశంకర్ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా కేంద్రమంత్రి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ యూనివర్శిటీలలో విపులమైన అవకాశాలు ఉన్నాయని అధునిక సాంకేతికతలను వినియోగించుకోవడం ద్వారా పరిశోధనలు సొంతంగా చేసేలా ఎదగాలన్నారు. ఆధునిక యుగంలో అన్ని విభాగాలలోన పరిశోధనలు, స్టార్టప్‌లకు ఎనలేని అవకాశాలు ఉన్నాయన్నారు. మీ ఉజ్వల భవిష్యత్తును రూపుదిద్దుకోవడం ద్వారా దేశానికి ఉత్తమ సేవలు అందించాలన్నారు. గురుపౌర్ణమి రోజునే పరిశోధనలకు అనుగుణమైన హబ్ ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. సర్ ఎం విశ్వేశ్వరయ్యకు తమ కుటుంబానికి సంబంధం ఉందని 1903లో విశ్వేశ్వరయ్య పూణేలో ఖడకవాసల అనకట్టను నిర్మాణాలకు సాంకేతిక సాయం చేశారని గుర్తు చేసుకున్నారు. తమ కుటుంబీకుల మాధవరావ్ సింధ్యా గ్వాలియర్‌లో ఆనకట్టను నిర్మించేందుకు సాంకేతిక సలహాలు సాయం చేశారన్నారు. విశ్వేశ్వరయ్య జీవితమే ఓ సాధన అంటూ కొనియాడారు. వీటీయూ పరిధిలో 210 ఇంజనీరింగ్ కళాశాలలు ఉన్నాయని 20వేల మంది ఇంజనీరింగ్ చదువుతున్నారనే విషయం సంతోషంగా ఉందన్నారు. సిలికాన్ సిటీ బెంగళూరు భవిష్యత్తులో సిలికాన్ వ్యాలీ అవుతుందన్నారు.

ఉత్కంఠగా కేఎంఎఫ్ డైరెక్టర్ ఎన్నికలు

- ఇరు వర్గాలకు చెరో 6 స్థానాలు



ఓటు హక్కు వినియోగించుకునేందుకు క్యూలో నిల్చున్న సభ్యులు

బళ్లారి గాంధీనగర్/రూరల్, జూలై 10(ఆంధ్రజ్యోతి): నగరంలోని రాయచూరు, కొప్పళ, బళ్ళారి, విజయనగర జిల్లాల పాల ఉత్పత్తి దారుల ఫెడరేషన్‌కు(రాబకోవి) డైరెక్టర్ల ఎన్నికలకు సంబంధించి గురువారం ఉత్కంఠంగా సాగింది. రాబకోవి పాలనా మండలిలో ఉన్న 12 డైరెక్టర్ల స్థానాలకు అత్యంత పోలీసు భద్రత నడుమ ఉదయం 9గంటల నుంచి సాయంత్ర 4గంటల వరకు సాగాయి. మధ్యాహ్నం ఒంటిగంట వరకు రాయచూరు, కొప్పళ జిల్లాలకు చెందిన ఓటర్లు మాత్రమే ఓటు హక్కు వినియోగించుకున్నారు. అయితే బళ్ళారి జిల్లాలకు చెందిన ఓటర్లు మధ్యాహ్నం 2గంటలు వరకు ఓటింగ్ ప్రక్రియ మందగతిన సాగింది. రెండు గంటల సమయానికి కేవలం 32 శాతం మాత్రమే ఓటింగ్ శాతం నమోదు అయింది. ఎన్నికల ప్రక్రియ ఎన్నికల అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేశారు. రాబకోవి పరిధిలో మొత్తం 805 పాల ఉత్పత్తి దారుల సంఘాలపైకి 466 మంది సంఘల సభ్యులు మాత్రమే ఓటు హక్కు కలిగి ఉన్నారు. ఇందులో బళ్లారికి 28, కొప్పళ 154, రాయచూరు 55, విజయనగర జిల్లాలో 299 మంది ఓటర్లల ఉన్నారు. ఈ సారి ఎన్నికల్లో మాజీ అధ్యక్షుడు భీమా నాఆయక్, మాజీ అధ్యక్షులు జి.సత్యనారాయణ, మాజీ ఉపాధ్యక్షులు బరిలో నిలవడం విశేషం. ఈ ఎన్నికల్లో ఉభయ జిల్లాలకు 4 స్థానాలు ఉండగా ఎన్నికల బరిలో 12మంది పోటీ చేశారు. కొప్పళ, రాయచూరు జిల్లాలకు 8 డైరెక్టర్ల స్థానాలకు 16మంది పోటీ చేశారు. ఈ రోజు జరిగిన ఎన్నికల్లో ఓటర్లను తమ వైపు తిప్పుకునే దిశలో భారీ ఎత్తున డబ్బులు ఆశ చూపినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.



బందోబస్తు విధుల్లో పోలీసులు

ఎన్నికల ఫలితాల్లో చెరో సగం...

బళ్లారి నగరంలో గురువారం జరిగిన రాబకోవి డైరెక్టర్ల ఎన్నికల్లో ఇరు వర్గాలకు తలా ఆరు స్థానాలు రావడంతో రాబకోవి పాలనా మండలి అధ్యక్ష స్థానం ఎవరనేది సందిగ్ధ పరిస్థితి నెలకొంది. ఈ సారి బళ్ళారి, విజయనగర జిల్లాల డైరెక్టర్లుగా భీమానాయక్, ఖిమంరుళ సిద్దప్ప, ఐగోళ చిదానంద ఎన్నిక అయ్యారు. బళ్ళారి రాయచూరు,కొప్పళ జిల్లాలో చేరి తిరిగి భీమానాయక్ వర్గాకి ఆరు మంది గెలుపొందగా, ప్రత్యర్థి వర్గానికి ఆరు స్థానాలు రావడం విశేషం. ప్రభుత్వ ఏ వర్గానికి మద్దతు ఇస్తుందో ఆ వర్గానికి చెందిన వారే ఈ సారి రాబకోవి పాలనా మండలికి అధ్యక్ష స్థానం వరించనుంది.

బంగ్లాదేశీయుల గుర్తింపునకు

ప్రత్యేక సర్వే ప్రారంభం

7

మహిళల ఫొటోలు, వీడియోలు తీసి

సోషల్ మీడియాలో పోస్టింగ్

- అసభ్య దృశ్యాలపై మహిళల ఫిర్యాదు
- నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు

క్రైం కార్నర్

దాడి కేసులో 21 మంది అరెస్ట్



అరెస్ట్ అయిన నిందితులు

రాయదుర్గం, జూలై 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని మైలాపురం, కొళగానహళ్లి గ్రామాల మధ్య జరిగిన దాడి, ప్రతిదాడి ఘటనలో గురువారం 21 మందిని అరెస్ట్ చేసినట్లు బొమ్మనహాళ్ ఎస్ఐ నబీరసూల్ తెలిపారు. రాయదుర్గం సర్కిల్ కార్యాలయం వద్ద గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మైలాపురం గ్రామానికి చెందిన మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకోవడంతో కొళగానహళ్లి గ్రామానికి చెందిన అనంతరాజు అనే వ్యక్తిపై దాడి జరిగిందన్నారు. ఇది రెండు గ్రామాల మధ్య వివాదంగా మారింది. ఈక్రమంలో రెండు గ్రామాల ప్రజలు మూకుమ్మడిగా దాడులు చేసుకున్నారు. దీంతో ఐదుగురు గాయపడ్డారు. పశువుల మేతను దహనం చేశారు. కారు, రెండు మోటారు వాహనాలను ధ్వంసం చేశారు. ఇళ్లల్లో చొరబడి టీవీలు, ఫర్నిచర్‌లు ధ్వంసం చేశారు. ఈ ఘటనలకు బాధ్యులుగా భావిస్తూ కొళగానహళ్లి గ్రామానికి చెందిన 21 మందిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచనట్లు ఎస్ఐ పేర్కొన్నారు. దాడిలో పాల్గొన్న మైలాపురం గ్రామానికి చెందిన మరో వర్గం వారు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, వారు డిశ్చార్జ్ కాగానే అరెస్టు చేస్తామన్నారు.

సార్..! నేను సచ్చిపోతా..!

- పోలీస్ యంత్రాంగానికి యువకుడి సెల్ఫీ వీడియో

గుత్తి, జూలై 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని రజాపురం గ్రామానికి చెందిన నామాల నారాయణస్వామి తాను ఆత్మహత్య చేసుకుంటానంటూ రైల్వే ట్రాక్‌పై నిలబడి ఓ సెల్ఫీ వీడియో తీసి జిల్లా పోలీస్ యంత్రాంగానికి పంపాడు. ఉలిక్కిపడిన పోలీసులు సమాచారాన్ని గుత్తి పోలీసులకు అందజేశారు. పోలీస్ బృందాలు అతడి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టాయి. అయితే ఆ వ్యక్తి తన సెల్‌ఫోన్‌ను స్విచ్ ఆఫ్ చేయడంతో వెతకడానికి పోలీసులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. నారాయణస్వామి ఈసురాళ్లపల్లి గ్రామానికి చెందిన ఓ యువతితో గతం లో ప్రేమాయణం నడిపాడు. మోసం చేయడంతో ఆమె పోలీసులను ఆశ్రయించింది. దీంతో నారాయణస్వామిపై కేసు నమోదు చేసి జైలుకు పంపారు. తిరిగి వచ్చిన అతడు నమ్మించి గత నెలలో ప్రియురాలిని వివాహం చేసుకున్నాడు. ఆమెతో కలిసి అనంతపురంలో కాపురం పెట్టాడు. తర్వాత తన సొంతూరు రజాపురం గ్రామానికి ఆమెను తీసుకువచ్చాడు. నారాయణస్వామి కుటుంబికులు ఆ యువతితో గొడవ పడ్డారు. వ్యవహారం పోలీస్‌స్టేషన్‌కు చేరడంతో పోలీసులు వారికి రెండు రోజుల కిందట కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. అయితే ఆ యువతిని వదిలించుకోవాలన్న నేపంతో నారాయణస్వామి ఈ నాటకీయ పరిణామాలకు తెరలేపినట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఆత్మహత్య చేసుకుంటానని పోలీసులకు సమాచారం ఇచ్చి అదృశ్యం కావడంతో అతడి కోసం రైల్వేట్రాక్ వెంట పోలీసులు గాలింపు చేపట్టారు. ఇప్పటిదాక అతడి ఆచూకీ తెలియలేదు.

కేంద్రమంత్రి దృష్టికి మామిడి రైతుల సమస్యలు

పుట్టపర్తి రూరల్, జూలై 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మామిడి రైతుల సమస్యలను కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ దృష్టికి సీఎం చంద్రబాబు తీసుకెళ్లారు. రైతులను ఆదుకునేందుకు కేంద్రం తరఫున తగు సాయం చేయాలని కోరారు. పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో కేంద్ర మంత్రిని సీఎం చంద్రబాబు గురువారం కలిశారు.

హాస్టల్ రీ మోడల్..!

- రూపురేఖలు మారిన గడేకల్లు వసతి గృహం
- అధ్వానం నుంచి అద్భుతమైన సౌకర్యాలు
- మంత్రి కేశవ్ చొరవతో బాగుపడిన బాలుర హాస్టల్

విడపనకల్లు, జూలై 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని గడేకల్లు ఎస్సీ బాలుర హాస్టల్ రూపు రేఖలు మారాయి. గత ఏడాది ఆగస్టులో ఈ ఎస్సీ బాలుర హాస్టల్‌కు చెందిన విద్యార్థులు ఇక్కడ ఉండలేము అంటూ ఆందోళన చేపట్టారు. ఈ విషయమై ఆంధ్రజ్యోతి దిన పత్రికలో గత ఏడాది ఆగస్టు 17న ఇక్కడ ఉండలేము అంటూ ప్రత్యేక కథనం ప్రచురితం చేసింది. దీనికి స్పందించిన టీడీపీ నాయకులు విషయాన్ని మంత్రి పయ్యావుల కేశవ్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి హాస్టల్ రీ మోడలింగ్‌కు రూ. 13.5లక్షలు ప్రత్యేక నిధులు కేటాయించి మరమ్మతులు చేపట్టేలా చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభం అయ్యే సమయానికి హాస్టల్‌ను రెడీ చేయించారు. మరుగు దొడ్లు, ట్రీ బెంచ్‌లు, హాస్టల్ గదుల్లో ఫ్యాన్లు, కిటికీలు, విద్యార్థులకు కొత్త పెట్టెలు, తాగు నీటి ట్యాంక్‌లు, చేతులు శుభ్రం చేసుకునేందుకు కొళాయిలు, డ్రైనేజీలు, ఏర్పాటు చేయించారు. హాస్టల్ చుట్టూ పరిసరాలను సైతం శుభ్రం చేయించారు. హాస్టల్ రూపురేఖలు మారడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రూపురేఖలు మారిన ఎస్సీ హాస్టల్





విద్యార్థులు చదువుకునేందుకు చెట్ల వద్ద ఏర్పాటు చేసిన అరుగులు

భయంగా ఉండేది



గత ఏడాది ఇక్కడ హాస్టల్‌లో ఉండాలంటే భయంగా ఉండేది. హాస్టల్ మొత్తం అధ్వానంగా ఉండేది. గత ఏడాది విద్యార్థులు అందరూ కలిసి జిల్లా అధికారులు దృష్టికి హాస్టల్ పరిస్థితిని తీసుకెళ్లాం. అధికారులు స్పందించి మా హాస్టల్ రూపు రేఖలు మార్చేశారు. ఇప్పుడు మాకు ఎటువంటి ఇబ్బంది లేదు. చాలా బాగుంది.

-సాయి దర్శన్, 8వ తరగతి

సౌకర్యాలు బాగున్నాయి



గతంలో మాకు హాస్టల్‌లో సౌకర్యాలు చాలా అధ్వానంగా ఉండేవి. ప్రస్తుతం అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. రంగులు వేసి హాస్టల్ భవనాన్ని కొత్తదానిగా తీర్చిదిద్దారు. శిథిలమైన పాత భవనాన్ని తొలగించి హాస్టల్ ప్రాంగణంలో విద్యార్థులు చదువుకునేందుకు ఏర్పాట్లు చేశారు. సన్నబియ్యంతో చేసిన భోజనం పెడుతున్నారు. హాస్టల్‌లో అన్ని సౌకర్యాలు చాలా బాగున్నాయి.

-పీబీ ప్రభాస్, పదో తరగతి

సీమ కరువును శాశ్వతంగా తరిమేద్దాం

పుట్టపర్తి టౌన్, జూలై 10(ఆంధ్రజ్యోతి): రాయలసీమ జిల్లాల్లో కరువు నివారణకు శాశ్వత పరిష్కారం కొనుగొందామని కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్ పేర్కొన్నారు. పుట్టపర్తి కలెక్టరేట్‌లో గురువారం ఆయన రాష్ట్రంలోని కరువు పీడిత జిల్లాల సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి అచ్చెన్నాయుడు, డైరెక్టర్ డిల్లీరావు, హార్టికల్చర్, సెరికల్చర్ కమిషనర్ శ్రీనివాసులు, జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్, అనంతపురం, కర్నూలు, శ్రీ సత్యసాయి జిల్లాల జేసీలు శివనారాయణ, నవ్య, అభిషేక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోని దక్షిణ జిల్లాల్లో కరువును శాశ్వతంగా నివారించాలన్నదే కేంద్రం ముఖ్యఉద్దేశ్యమన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు కలిసికట్టుగా ఆలోచించి, కరువు నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో కేంద్రానికి నివేదికలు ఇవ్వాలన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, ఎక్కడ లోపాలున్నాయో గుర్తించి, పరిష్కారానికి కార్యచరణ ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. వ్యవసాయ శాఖ డైరెక్టర్ డిల్లీరావు, సెరికల్చర్ కమిషనర్ శ్రీనివాసులు, రాయలసీమ జిల్లాలో కరువు పరిస్థితి, వివిధ పంటల సాగువివరాలు, ఇరిగేషన్ అంశాల గురించి పవర్ పాయింట్ ప్రెజేంటేషన్ ద్వారా తెలిపారు. బుందేల్‌ఖండ్ రీజియన్ మాదిరిగా రాయలసీమ జిల్లాలకు ఆర్థిక సాయం ప్రకటించాలని, సీమాభివృద్ధికి సహకారమందించాలని కోరారు. ఈ సమావేశంలో రాయలసీమజిల్లా వ్యవసాయ, ఉద్యాన, అనుబంధ అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

రైతులే దేశానికి బలం

రైతులే దేశానికి బలమని, వారి అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమని కేంద్రమంత్రి పేర్కొన్నారు. మండలంలోని పెడబల్లి గ్రామంలో సేంద్రియ పద్ధతిలో సాగుచేసిన మిశ్రమ పంటను కేంద్రమంత్రి గురువారం పరిశీలించారు. వర్షాభావం వల్ల ఎండిన పంటలపై ఏర్పాటు చేసిన ఛాయచిత్ర ప్రదర్శన తిలకించారు. అనంతరం పెడబల్లి గ్రామ పొలాల రైతులు, స్వయం సహాయక సంఘాల మహిళలతో ముఖాముఖి మాట్లాడారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కేంద్రమంత్రి మాట్లాడుతూ దేశాభివృద్ధిలో రైతుల పాత్ర కీలకమైనదన్నారు. మహిళలు పేదరికాన్ని జయించి, ఆత్మగౌరవంతో జీవించాలన్నారు. శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ చేతన్ సూచించిన విధానంలో రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని చేయడం శుభసూచకమన్నారు. తాను మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మహిళల సాధికారతకు ప్రాధాన్యం ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. అనంతరం శ్రీసత్యసాయి, అనంతపురంజిల్లాలకు చెందిన 53,746 ఎస్‌హెచ్‌జీ సభ్యులకు రూ.437.9కోట్ల బ్యాంక్ లింకేజీ చెక్కును కేంద్రంమంత్రి అందించారు. అంతకుముందు ఎస్‌హెచ్‌జీ సభ్యులు ఏర్పాటు చేసి ఉత్పత్తుల స్టాల్స్‌ను కేంద్ర మంత్రి పరిశీలించి, వారిని అభినందించారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్‌కుమార్, రైతు సంక్షేమ శాఖ జాతీయ జాయింట్ సెకటరీ పెర్నిదేవి, రాష్ట్ర సెర్ప్ సీఈఓ కరుణ, రాష్ట్ర అగ్రికల్చర్, మార్కెటింగ్ సహకర సంఘం ఛైర్మన్ విజయ్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, రైతులు, మహిళల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

ధర్మవరం, జూలై 10(ఆంధ్రజ్యోతి): చిగిచెర్ల-ధర్మవరం రైల్వేస్టేషన్ల మధ్య గురువారం గుర్తుతెలియని వ్యక్తి ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి మరణించాడు. ధర్మవరం జీఆర్‌పీ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 20 నుంచి 30 సంవత్సరాల వయసుగల వ్యక్తి రైలు నుంచి ప్రమాదవశాత్తు జారిపడి మృతిచెందాడు. మృతుడి ఒంటిపై లేతనీలిరంగు టీషర్ట్, నలుపురంగు చొక్కా, ఎడమ చేతిపై నేహ అనే పచ్చబొట్టు ఉందని తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9440557054, 9951325345 నంబర్లలో సంప్రదించాలన్నారు.

కళాభివందనం

- పద్మశ్రీ చలపతిరావుకు మంత్రి పాదాభివందనం
- తోలుబొమ్మల కళకు జీవం పోశారంటూ ప్రశంసలు



పద్మశ్రీ అవార్డు గ్రహీత దళవాయి చలపతిరావును సత్కరిస్తున్న సత్యకుమార్ యాదవ్

ధర్మవరం రూరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): పద్మశ్రీ అవార్డు గ్రహీత, తోలుబొమ్మల కళాకారుడు దళవాయి చలపతిరావుకు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పాదాభివందనం చేశారు. ప్రాచీన తోలుబొమ్మల కళకు జీవం పోశారని కొనియాడారు. బీజేపీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో గురుపౌర్ణమి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా తలపెట్టిన ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ గురువారం మండలంలోని నిమ్మలకుంట గ్రామంలో పర్యటించారు. తోలుబొమ్మల కళలో పేరొందని పద్మశ్రీ అవార్డు గ్రహీత దళవాయి చలపతిరావు ఇంటికి వెళ్లి ఆయనను శాలువాకప్పి, పూలమాలతో సత్కరించారు. దళవాయి చలపతిరావు సాధించిన అవార్డులను పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ.. దళవాయి చలపతిరావు కళాకారుడు మాత్రమే కారనీ, భారతీయ సంస్కృతికి వారసుడన్నారు. ఆయన వంటి వారు ఈ ప్రాంతంలో ఉండటం అందరికీ గర్వకారణమన్నారు. అలాంటి కళలు, కళాకారులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు జింకా చంద్రశేఖర్, నాయకులు ఓబులేసు, శ్యామ్‌రావు, గోనుగుంట్ల భూషణ్, అంగజాల రాజు పాల్గొన్నారు.



చలపతిరావుకు పాదాభివందనం చేస్తున్న మంత్రి

- గండిచెరువు నిండితే రైతులకు ఇబ్బందులే
- సోమయాజులపల్లి, వేపలకుంట రైతులకు దారి సమస్య
- దిగుబడిని పొలాల్లో వదిలేయాల్సిందే
- పట్టించుకోని పాలకులు, అధికారులు

మాగోడు ఎవరూ పట్టించుకోరు



గండిచెరువుకు అటు వైపు మాకు వ్యవసాయ భూమి ఉంది. మేము పండించిన పంటలను చెరువు నిండితే తీసుకురావడానికి నానా కష్టాలు పడాల్సి వస్తోంది. పలుమార్లు మా సమస్యను అధికారులకు తెలిపినా పట్టించుకోలేదు. రైతుల గోడు పట్టించుకునే నాయకులే లేకుండాపోయారు. - **రాజారెడ్డి, రైతు, వేపలకుంట**

నిండుకుండలా గండిచెరువు (ఫైల్)



గుండె చెరువు!

గాండ్లపెంట, జూలై 9(ఆంధ్రజ్యోతి): సాధారణంగా చెరువు నిండితే రైతులకు సంతోషం కలుగుతుంది. కానీ రెండు గ్రామాల రైతులకు మాత్రం ఇబ్బంది కలుగుతోంది. మండలంలోని వేపలకుంట గ్రామానికి ఆనుకుని ఉన్న గండిచెరువు నిండితే పొలాలకు వెళ్లడానికి దారి లేకుండాపోతోందని సోమయాజులపల్లి, వేపలకుంట రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విజయనగర రాజుల కాలంలో నిర్మించిన గండి చెరువుకు దాదాపు 15 సంవత్సరాల కిందట మరమ్మతులు చేశారు. దీంతో ఎగువ ప్రాంతాలైన మల్లమీదపల్లి, సామచేనుబైలు, ఎన్పీకుంట మండలంలోని పలుగ్రామాల నుంచి వచ్చే వర్షపు నీరు ఈ చెరువుకు చేరి, నిల్వ ఉంటోంది. దీంతో గండిచెరువు దిగువన బోరుబావుల్లో నీరు పుష్కలంగా లభిస్తోంది. చెరువుకు అటువైపు సోమయాజులపల్లి, వేపలకుంట గ్రామాల రైతులకు చెందిన దాదాపు ఐదు వందల ఎకరాలకుపైగా భూములు ఉన్నాయి. వీటిని ఖరీఫ్, రబీలో సాగు చేస్తున్నారు. చెరువు నిండితే అవతల ఉన్న పొలాల నుంచి దిగుబడిని ఇంటికి చేర్చుకోవడానికి రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పలుమార్లు అధికారులు, పాలకులకు చెప్పినా ప్రయోజనం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం గండిచెరువుకు అటువైపు భూముల్లో వరినార్లు వేసుకుంటున్నారు. పంట కోత సమయంలో చెరువు నిండితే తమ పరిస్థితి ఏమిటని వారు ఆందోళన చెందుతున్నారు.



గాసం కోసం నీటిలోనే పశువులను తీసుకెళ్తున్న రైతులు (ఫైల్)

ప్రతిపాదనలు పంపాం

గండిచెరువు నిండితే అటువైపు భూములకు రహదారి లేక రైతులు ఇబ్బందులు పడుతున్న విషయం మా దృష్టికి వచ్చింది. రోడ్డు నిర్మాణం కోసం ప్రణాళికలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపాం. ఉత్తర్వులు, నిధులు మంజూరైన వెంటనే పనులు మొదలు పెడతాం.

- అరుణకుమారి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ

ఎగువ ప్రాంతంలో రస్తా ఏర్పాటు

గండిచెరువు ఎగువప్రాంతంలో కొంతమంది రైతులు సొంతంగా రూ. లక్షలు ఖర్చు చేసి రస్తా ఏర్పాటు చేసుకున్నారు. గత పదేళ్లుగా రస్తా లేకపోవడంతో చేతికొచ్చిన పంటలను వదిలేయాల్సి దుస్థితి నెలకొంది. ప్రభుత్వం, పాలకులు పట్టించుకోకపోవడంతో సోమయాజులపల్లికి చెందిన జయరాం, కొండయ్య, చంద్ర తదితర రైతులు కలిసి సొంతంగా దాదాపు రూ.3లక్షలు ఖర్చు చేసి మరువ సమీపం నుంచి చెరువు కట్టమీదుగా రస్తా ఏర్పాటు చేసుకున్నారు. అయితే దిగువప్రాంత రైతుల ఈ రస్తాలో వెళ్లడానికి వీలు కాదు.

చెరువు నిండితే పంటను వదిలేయాల్సిందే

సోమయాజులపల్లి, వేపలకుంట, గ్రామాల రైతులకు గండిచెరువు అటువైపున భూములున్నాయి. చెరువుకు మరమ్మతులు చేపట్టక ముందు వేపలకుంట సమీపంలో రస్తా సౌకర్యం ఉండేది. రైతులు సాగుచేసిన పంటలను, పశుగ్రాసం, పశువులను తీసుకొచ్చేందుకు వీలుండేంది. ప్రస్తుతం చెరువు నిండితే పొలాలకెళ్లే దారి మొత్తం నీటితో మునిగిపోతోంది. దీంతో రైతుల రాకపోలకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. చెరువు నిండితే పంటను వదిలేయాల్సిందే అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువు అటువైపు వివిధరకాల పంటలు, మామిడితోటలు, కూరగాయా లు తదితరవాటిని సాగుచేస్తారు. ఆగ్రామాల్లో పాడి పశువులు అధికంగా ఉ న్నాయి. గ్రాసాన్ని చెరువు అటువైపు భూములనుంచి తెచ్చుకోవాల్సిందే. వర్షాకాలంలో నీటిలో వెళ్తూ గడ్డి మోపులు మోసుకుని రావాల్సి వస్తోంది. అలాగే పశువులను మేతకు తీసుకెళ్లాలంటే చెరువులోనే వెళ్లాల్సి వస్తోంది.

బాధ్యతలు చేపట్టిన పన్నుల శాఖ జేసీ, డీసీ

అనంతపురం కలెక్టరేట్, జూలై 10(ఆంధ్రజ్యోతి): వాణిజ్య పన్నులశాఖ జిల్లా జాయింట్ కమిషనర్(జేసీ)గా ఇందుకూరి హేమ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇక్కడ జేసీగా పనిచేస్తున్న శేషాద్రిని విజయవాడ-1 సర్కిల్‌కు బదిలీ చేసి, విజయవాడ-3 సర్కిల్‌లో పనిచేస్తున్న హేమను ఇక్కడకు నియమించారు. డిప్యూటీ కమిషనర్‌గా భాస్కరవల్లి పెనుముళ బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు ఇక్కడ పనిచేస్తున్న మురళీమనోహర్‌ను కర్నూలుకు బదిలీ చేశారు. విజయనగరంలో పనిచేస్తున్న భాస్కరవల్లి పెనుముళను జిల్లాకు నియమించారు.

డిప్యూటీ ఎంపీడీఓలు..

అనంతపురం న్యూటౌన్, జూలై (ఆంధ్రజ్యోతి): జిల్లాలో డిప్యూటీ ఎంపీడీఓలుగా ఉద్యోగోన్నతి పొందిన వారు గురువారం బాధ్యతలు చేపట్టారు. డీపీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న లీలాబాయి కంబదూరు డిప్యూటీ ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టారు. ధర్మవరం డీఎల్‌పీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న విజయ్‌కుమార్ శింగనమల డిప్యూటీ ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టినట్లు తెలిసింది. అశ్వత్థ నాయుడుకు ఇంకా ప్లేస్‌మెంట్ కేటాయించాల్సి ఉంది.

విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు

- విద్యార్థులు కష్టపడి చదవాలి
- మంత్రి పయ్యావుల కేశవ్
- ఉరవకొండలో మెగా పీటీఎంకి హాజరు

ఉరవకొండ, జూలై10(ఆంధ్రజ్యోతి): విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన మెగా పీటీఎం కార్యక్రమానికి మంత్రితోపాటు కలెక్టర్ వినోద్ కుమార్ హాజరయ్యారు. మంత్రి మాట్లాడుతూ.. ఒక్కో విద్యార్థికి ప్రభుత్వం రూ.94వేలు ఖర్చు చేస్తోందన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి, బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. కలెక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. మెగా పీటీఎం గిన్నిస్ బుక్ రికార్డుల్లో చోటు దక్కించుకునే అవకాశం ఉందన్నారు. గ్రీన్‌పాస్‌పోర్టు ద్వారా విద్యార్థులు మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేకాధికారి తిప్పేనాయక్, తహసీల్దార్ మహబూబ్ బాషా, ఎంపీడీవో రవి ప్రసాద్, ఎంఈవోలు ఈశ్వరయ్య, రమాదేవి, ప్రిన్సిపాళ్లు కృష్ణమూర్తి షాషావలి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పరీక్ష ఫలితాలు విడుదల

గుంతకల్లుటౌన్, జూలై 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీ శంకరానంద గిరి స్వామి డిగ్రీ కళాశాల (అటానమస్) రెండో సెమిస్టర్ పరీక్ష ఫలితాలను గురువారం విడుదల చేశారు. కళాశాల డైరెక్టర్ గోపాల్ మాట్లాడుతూ.. పరీక్ష ఫలితాలను కళాశాల వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చన్నారు. ఈ సెమిస్టర్‌లో ఎక్కువ శాతం అమ్మాయిలే ఉత్తీర్ణత సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌బాబు, పరీక్షల నియంత్రణ అధికారి నటరాజ్ పాల్గొన్నారు.

ఇన్‌చార్జి తహసీల్దారుగా చంద్రమోహన్‌రావు

విడపనకల్లు, జూలై 10(ఆంధ్రజ్యోతి): స్థానిక ఇన్‌చార్జి తహసీల్దారుగా చంద్రమోహన్‌రావు గురువారం బాధ్యతలు చేపట్టారు. 15 రోజుల క్రితం ఇక్కడ తహసీల్దారుగా బాధ్యతలు చేపట్టిన ఓబులేసు దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు.

మాది రంగుల పిచ్చిలేని ప్రభుత్వం

- పెనుకొండ పీటీఎం కార్యక్రమంలో మంత్రి సవిత

పెనుకొండ టౌన్, జూలై 10(ఆంధ్రజ్యోతి): తమది రంగుల పిచ్చి లేని ప్రభుత్వమని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. పెనుకొండ జూనియర్ కళాశాలలో గురువారం నిర్వహించిన మెగా పీటీఎం కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలు త విద్యార్థులచే వారి తల్లులకు కాళ్లు మొక్కించి తల్లికివందనం కార్యక్ర మాన్ని చేపట్టారు. అనంతరం విద్యార్థులతో కలిసి మంత్రి సవిత మధ్యాహ్న భోజనం తిన్నారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ 2014-19లో జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించేవారమని, 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో ఆపేశారన్నారు. ప్రస్తుతం తమ ప్రభుత్వం డొక్కా సీతమ్మ పేరుతో మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు అందిస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ రోజు 2.3కోట్ల మందితో మెగా పీటీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల 67 లక్షల మంది కి తల్లికివందనం అందించామన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరుతో రూ.2,500విలువ చేసే విద్యా సామగ్రి కిట్ అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు అందిస్తున్నామని, తల్లిదండ్రు లు బాధ్యతగా విద్యార్థుల చదువులపై శ్రద్ధ చూపాలన్నారు. కా ర్యక్రమంలో కమిషనర్ సురేష్‌కుమార్, ఎంఈఓ చంద్రశేఖర్, నాయకు లు శ్రీరాములు, ప్రసాద్, నారాయణస్వామి, ఎగువగడ్డ కృష్ణమూర్తి, బాబుల్‌రెడ్డి, త్రివేంద్ర, సమీ, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ బంగారం ముఠా అరెస్టు

- హాల్ మార్క్ లేజర్ మిషన్ స్వాధీనం

గుంతకల్లుటౌన్, జూలై10(ఆంధ్రజ్యోతి): నకిలీ బంగారు నగలు తయారు చేసే ముఠాను కసాపురం పోలీసులు అరెస్టు చేశారు. 9 మందిని అరెస్టు చేసి, వారి నుంచి 39 గ్రాముల బంగారు గాజులు, 13 నకిలీ బంగారు ఉంగరాలు, రూ.లక్ష నగదు, హాల్ మార్క్ వేసే మిషన్, 200 గ్రాముల నాలుగువెండి కాలి పట్టీలు, 15గ్రాముల వెండి కడియం, 145 గ్రాముల కాపర్ తీగలు, వేయింగ్ మిషన్ స్వాధీనం చేసుకున్నారు. కసాపురం పోలీసు స్టేషన్‌లో గురువారం సాయంత్రం రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ టీపీ వెంకటస్వామితో కలిసి ట్రైనీ డీఎస్పీ అశ్రఫ్ అలీ.. ముఠా అరెస్టు వివరాలను వెల్లడించారు. పట్టణానికి చెందిన భార్గవకుమార్, శివానంద ఈనెల 8వ తేదీన పట్టణంలోని కరూర్ వైశ్యాబ్యాంకులో నాలుగు బంగారు నకిలీ గాజులను తాకట్టు పెట్టేందుకు వెళ్లారు. పరీక్షించిన బ్యాంకు సిబ్బంది నకిలీ బంగారు తెచ్చారని నిలదీశారు. తమకు వేరేవాళ్లు ఇచ్చారంటూ వారు అక్కడి నుంచి జారుకున్నారు. ఈ విషయంపై బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ వెంకట్ రెడ్డి బుధవారం కసాపురం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కసాపురం రోడ్డులోని ఎస్‌బీఐ బ్యాంకు వద్ద ఉన్న నిందితులను పట్టుకున్నారు. పట్టణంలో బంగారు షాపు నిర్వహిస్తున్న క్రాంతి, వేణుగోపాల్ సాయంతో నకిలీ బంగారు ఆభరణాలు తయారు చేస్తున్నట్లు గుర్తించారు. లేజర్ మిషన్‌తో 30టచ్ గోల్డ్ తయారు చేసి, విక్రయించడం, తాకట్టు పెట్టడం చేస్తున్నారు. సాధారణ ప్రజలు గుర్తించలేకుండా వాటిపై హాల్ మార్క్ కూడా వేస్తున్నారు. పట్టణానికి చెందిన భార్గవ్‌కుమార్, క్రాంతి, వేణుగోపాల్, శివానంద, ఎరుకల శ్రీనివాసులు, నరేంద్ర, మహమ్మద్ జావేద్, కర్నూలు నగర వాసులు మేకల శ్రీనివాసులు, మల్లెమాల నరేష్ అరెస్టయిన వారిలో ఉన్నారు.



అరెస్టు వివరాలను వెల్లడిస్తున్న ట్రైనీ డీఎస్పీ

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంబ్...

సీఎస్ఆర్ ఆంజనేయులు (జయంతి)



తొలితరం తెలుగు సినీ నటుడు సీఎస్ఆర్‌గా చిరపరిచితులైన చిలకలపూడి సీతారామ ఆంజనేయులు 1907 జూలై 11న కృష్ణా జిల్లా మచిలీపట్నం మండలంలోని చిలకలపూడిలో జన్మించారు. నాటకరంగంలోనూ, వెండితెరపైనా తనదైన చెరగని ముద్రవేశారు. రామదాసు, తుకారాం, సారంగధర వంటి విభిన్నపాత్రలకు నాటకరంగంలో అలవోకగా నటించి జీవం పోశారు. ఐదున్నర దశాబ్దాల్లో 175కుపైగా తెలుగు సినిమాలలో నటించారు. 1937లో ఆయన నటించిన 'భక్త రామదాసు' ఎన్నో అవార్డులు పొందింది. 1950లో 'పాతాళ భైరవి' సినిమా దేశంలో ఏర్పాటైన తొలి అంతర్జాతీయ చలనచిత్రోత్సవంలో ప్రదర్శించబడింది. ప్రత్యేకించి 'శ్రీకృష్ణ' వేషధారణలో గుర్తింపు పొందారు. 'మాయా బజార్'లో శకుని పాత్రలోనూ, కన్యాశుల్కంలో రామప్పపంతులుగా, ఇల్లరికంలో మేనేజరుగా, కన్యాదానంలో పెళ్ళిళ్ల పేరయ పాత్రలకు జీవం పోశారు. అలాగే ఇతర సాంఘిక చిత్రాలలో సత్తా చాటుకున్నారు. 1963 అక్టోబరు 8న కన్నుమూశారు.

నూకల చిన్న సత్యనారాయణ (వర్ధంతి)



'పద్మభూషణ్' గ్రహీత డాక్టర్ నూకల చిన్నసత్యనారాయణ 1923 ఆగస్టు 4న విశాఖ జిల్లా అనకాపల్లిలో జన్మించారు. కర్ణాటక సంగీతానికి ఎనలేని సేవలందించిన బహుముఖ ప్రజ్ఞాశాలి. 'మహామహోపాధ్యాయ'గా పేరొందారు. విజయనగరంలోని మహారాజ కాలేజ్ ఆఫ్ మ్యూజిక్‌లో ప్రొఫెసర్‌గా, ప్రిన్సిపాల్‌గా, తిరుపతి శ్రీ వెంకటేశ్వర సంగీత కళాశాలకు ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. రేడియోలో భక్తి రంజనిలో ఆయన పాఠాలు ఎంతో పేరొందాయి. టీటీడీ, కంచి కామకోటి పీఠం, శృంగేరి శంకర, పుష్పగిరి పీఠాలకు 'ఆస్థాన విద్వాన్' గా వ్యవహరించారు. 2013 జూలై 11న కన్నుమూశారు.

మణిశర్మ (పుట్టినరోజు)



ప్రముఖ సంగీతదర్శకుడు మణిశర్మ 1964 జూలై 11న కృష్ణా జిల్లా మచిలీపట్నంలో జన్మించారు. స్వరకర్త, గాయకుడు, సంగీత దర్శకుడిగా పేరొందారు. తెలుగుతోపాటు తమిళ, హిందీ, కన్నడ సినిమాలలో రాణించారు. 200కుపైగా సినిమాలకు సంగీతం అందించి 'మెలోడీ బ్రహ్మ, స్వరబ్రహ్మ'గా పేరొందారు. ఆయన సంగీతం అందించిన పలు హీరోల సినిమాలు బ్లాక్ బస్టర్‌గా నిలిచాయి. కీబోర్డు, మాండోలిన్, హార్మోనియం, గిటార్ వంటి వాటిపై పట్టు ఉంది. ఉత్తమ సంగీత దర్శకుడిగా రెండు నంది అవార్డులు, మూడు ఫిల్మ్‌ఫేర్ అవార్డ్సుతో, సినిమా అవార్డ్స్, మిర్చి మ్యూజిక్ అవార్డులు తదితర పురస్కారాలు అందుకున్నారు.

మహిళల ఫొటోలు, వీడియోలు తీసి

సోషల్ మీడియాలో పోస్టింగ్

- అసభ్య దృశ్యాలపై మహిళల ఫిర్యాదు
- నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు



గురుదీప్‌సింగ్

బెంగళూరు, జూలై10 (ఆంధ్రజ్యోతి) : బెంగళూరులోని చర్చి స్ట్రీట్, ఎంజీరోడ్, ఇందిరానగర్ వంటి రద్దీ ప్రాంతాలు, పబ్, క్లబ్‌లు కలిగిన ప్రాంతాల్లో ఫ్యాషన్‌గా తిరిగే యువతుల వీడియోలు, ఫోటోలు తీసి సోషల్ మీడియా ద్వారా అప్‌లోడ్ చేస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టుచేశారు. బనశంకరి పోలీసులు పంజాబ్‌కు చెందిన గురుదీప్‌సింగ్(26)ను పట్టుకున్నారు. ఇతడు కోరమంగళ, చర్చిస్ట్రీట్, ఇందిరాగనర్ వంటి క్లబ్‌లు, పబ్‌లు కలిగిన ప్రదేశాలలోనే నిత్యం తిరిగేవారని గుర్తించారు. ఫ్యాషన్ దుస్తులు వేసుకునే యువతుల ఫొటోలు, వీడియోలను రహస్యంగా తీసేవారు. యువతులతో పాటు ప్రేమికులను వీడియోలు తీసి వాటికి పాటలు అనుబంధంగా జోడించి ఇన్‌స్టాగ్రాంలో పోస్టు చేసేవారు. ప్రత్యేకించి యువతులను అసభ్యంగా చూపేవారు. తమకు తెలియకుండానే ఎలా ఇన్‌స్టాలో ఫొటోలు వచ్చాయని కొందరు యువతులు ఆరా తీశారు. కొందరు మహిళలు బనశంకరి పోలీసులకు ఫిర్యాదు చేసిన మేరకు కేసు నమోదు చేసుకుని ఇన్‌స్టా ఖాతా ప్రకారం గుర్తించి గురుదీప్‌సింగ్‌ను అరెస్టు చేశారు. అతడి నుంచి ఐఫోన్‌తో పాటు మెమోరీ కార్డులను స్వాధీనం చేసుకున్నట్లు బనశంకరి పోలీసులు తెలిపారు. సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు పెడితే కఠినచర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. ఇతడిపై పలు సెక్షన్‌ల కింద కేసులు నమోదు చేశారు. పలు మహిళా సంఘాలు అతడిని కఠినంగా శిక్షించాలని పోలీసులను కోరారు.

పశువుల మందుల టెండర్ రద్దు చేయాలి: జమలయ్య

అమరావతి, జూలై 10(ఆంధ్రజ్యోతి): పశువుల మందుల కొనుగోలుకు పాత నిబంధనలతోనే కొత్త టెండరును పిలవాలని ఏపీ కౌలు రైతుల సంఘం ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య పశుసంవర్ధక శాఖను కోరారు. నాసిరకం మందులు సరఫరా చేసే కంపెనీలకు అనుకూలంగా కొత్త నిబంధనలు పెట్టి, టెక్నికల్ బిడ్ ఓపెన్‌కు సిద్ధమౌతున్న నేపథ్యంలో ఆ టెండరును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రూ.15కోట్ల టర్నోవర్ కలిగిన కంపెనీలను టెండరు ద్వారా పిలవాల్సి ఉండగా.. టర్నోవర్‌ను రూ.12.5కోట్లకు కుదించడం వల్ల మందుల నాణ్యత ప్రశ్నార్ధకమౌతుందన్నారు. 2018 నుంచి వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ స్థాయిలో మందులు కొనే పద్ధతి ఉండగా, ఇప్పుడు జిల్లా పశువైద్యాధికారి మందులు కొనుగోలు చేసే పద్ధతిని ప్రవేశపెట్టడం సరికాదన్నారు. ఎంఎంఎస్ సాఫ్ట్‌వేర్ విధానాన్ని కొనసాగించాలని, మందుల నాణ్యత నిర్ధారణ తర్వాతే కంపెనీలకు చెల్లింపులు జరపాలని సూచించారు. లేకపోతే ప్రజాధనం వృధా అయ్యే ప్రమాదం ఉందన్నారు.



అరికెరె శాంతిధామలో పూజల్లో ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి



హెచ్ఎస్ఆర్ లే అవుట్‌లో మాజీ ఎంపీ ఉగ్రప్ప



పుట్టేనహళ్ళి సాయిమందిరంలో భక్తుల సందడి

గురుభ్యోనమః..!

బొమ్మనహళ్ళి, జూలై 10(ఆంధ్రజ్యోతి): గురుపూర్ణిమను పురస్కరించుకుని షిర్డీసాయిబాబా, రాఘవేంద్రస్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. గురువారం ఉదయం నుంచి రాత్రి దాకా పలు కార్యక్రమాలు కొనసాగాయి. అరికెరె శాంతినికేతన్ లే అవుట్‌లోని శాంతిధామ షిర్డీసాయిబాబా ఆలయంలో భక్తులు ఉదయంనుంచే బారులుతీరారు. 16వ గురుపూర్ణిమ ఉత్సవాల నేపథ్యంలో స్వామివారికి కాగడ హారతి, భక్తులతో స్వయంగా మూలవిరాట్టుకు క్షీరాభిషేకం, అనంతరం వివిధ రకాల పుష్పాలు, నూతన పట్టువస్త్రాలతో అలంకరణ చేశారు. ధూపదీప నైవేద్యాలు సమర్పించి మహామంగళామంగళారతి జరిపారు. సాంస్కృతిక కచేరి, ధ్యానమందిరంలో సత్యనారాయణపూజ జరిపారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. దాతలు, ప్రముఖులను ఆత్మీయంగా సత్కరించినట్టు ఆలయ ట్రస్టు అధ్యక్షుడు మేడా రామకృష్ణ తెలిపారు. వేలాదిమంది భక్తులు తరలిరావడంతో క్యూ విధానం అమలు చేసినట్టు తెలిపారు. సాయంత్రం పురవీధులలో స్వామివారి రథయాత్ర నిర్వహించారు. ఆలయాన్ని విద్యుద్దీపాలు, పుష్పాలతో అలంకరించారు. భక్తులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనం కూడా సమకూర్చారు. రాత్రి 10.30 గంటల వరకు దర్శన సదుపాయం కల్పించారు. మంజునాథస్వామి, సంతోషిమాత, షిర్డీసాయిబాబా ఆలయాలు ఉండడంతో భక్తులు పోటెత్తారు. విశేషపూజల్లో ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్‌లు రవి (పురుషోత్తం), భాగ్యలక్ష్మీ మురళి, కాంగ్రెస్ నాయకులు ఉమాపతిగౌడ, బొమ్మనహళ్ళి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మధు, కేపీసీసీ సభ్యుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాలను ఆలయ ట్రస్టు ఉపాధ్యక్షులు ముకేశ్‌కుమార్ వర్మ, ప్రకాశ్ నర్వాణి, కార్యదర్శి తాతయ్యగుప్త, సభ్యులు కేవీ కృష్ణయ్యశెట్టి, వెంకటేశ్‌గుప్త, సత్యనారాయణశెట్టి, సేవాదళ్ సభ్యులు పర్యవేక్షించారు.

హెచ్ఎస్ఆర్ లే అవుట్‌లో..

హెచ్ఎస్ఆర్ లే అవుట్ కూల్‌జాయింట్ సర్కిల్‌లోని సాయిబాబా దేవస్థానంలో గురుపూర్ణిమ వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి కాగడ హారతితో ప్రారంభమై రాత్రి 11 గంటల వరకు ఉత్సవాలు సాగాయి. వేలాదిమంది భక్తులకు తీర్థప్రసాదాలు అన్నదానం నిర్వహించారు. షిర్డీసాయి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో వేడుకలు సాగాయి. మహాగణపతి హోమం, ఇతరధార్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఇక్కడ కూడా ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి పాల్గొన్నారు. మాజీ ఎంపీ ఉగ్రప్ప, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రామచంద్ర పాల్గొన్నారు.

శిడ్లఘట్టలో..

శిడ్లఘట్ట(ఆంధ్రజ్యోతి): గురుపూర్ణిమను పురస్కరించుకుని పట్టణంలోని ఆధ్యాత్మిక గురువు, కాలజ్ఞాన రచయిత కైవార నారేయణ తాతయ్య ఆలయంలో గురువారం విశేషపూజలు నిర్వహించారు. అలాగే శ్రీరామమందిరంలోని కైవార తాతయ్యకు, చింతామణి రోడ్డులోని వీరాంజనేయస్వామి ఆలయంలోని కైవార తాతయ్యలకు ప్రత్యేక పూజలు, అలంకరణలు చేశారు. వీరాంజనేయస్వామి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. వినాయక ఆలయంలోనూ, వాసవిరోడ్డులోని లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో, రాఘవేంద్రస్వామి మఠంలో, కాళికాంబ కమ్మటేశ్వర ఆలయంలో తదితర ఆలయాలలో విశేషపూజలు జరిగాయి. ఎటు చూసినా ఆలయాలలో భక్తుల సందడి నెలకొంది.

బాగేపల్లిలో..


బాగేపల్లి (ఆంధ్రజ్యోతి): గురుపూర్ణిమను పురస్కరించుకుని పట్టణంలోని ఒకటో వార్డులోని షిర్డీ సాయిబాబా మందిరంలో ఆలయ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఉత్సవాలు వైభంగా నిర్వహించారు. ట్రస్టు అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో కమిటీ పదాధికారులు పర్యవేక్షించారు. కాగడ హారతి, క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, సత్యనారాయణపూజ, మహామంగళారతి, భజనలు అనంతరం ప్రసాదం పంపిణీ చేశారు.

పంచముఖి ఆంజనేయస్వామి ఆలయంలో..

ముళబాగిలు (ఆంధ్రజ్యోతి): గురుపూర్ణిమను పురస్కరించుకుని పట్టణంలోని గుణిగుంటపాళ్యలోని పంచముఖి ఆంజనేయస్వామి ఆలయంలో 27వ వార్షికోత్సవం కార్యక్రమాలు కూడా వైభవంగా జరిగాయి. గణపతిపూజ, పుణ్యాహవచనం, నవగ్రహ ఆరాధన, ప్రధాన దేవతా కళశారాధన, రామనామతారక హోమం, ఆంజనేయస్వామి మూలమంత్రహోమం, మహాపూర్ణాహుతి, మహామంగళారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అర్చకులు శేషాద్రి నేతృత్వంలో పూజా కైంకర్యాలు శాస్త్రోక్తంగా జరిగాయి. భక్తులకు అన్నసంతర్పణ నిర్వహించారు. వ్యాయామపాఠశాల గురువులు కృష్ణప్ప, అధ్యక్షుడు గరడి శంకర్, కార్యదర్శి ఉమాశంకర్, కోశాధికారి వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



కైవార నారేయణ తాతయ్య



పంచముఖి ఆంజనేయస్వామి



విజయనగర్ సాయిబాబా ఆలయంలో ఎమ్మెల్యే కృష్ణప్ప

హంపినగర్ వార్డులో..

విజయనగర్ (ఆంధ్రజ్యోతి): గురుపూర్ణిమను పురస్కరించుకుని హంపినగర్ వార్డులోని గురు వీరాంజనేయస్వామి దేవస్థానంలో గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే కృష్ణప్ప పాల్గొన్నారు.

బంగ్లాదేశీయుల గుర్తింపునకు ప్రత్యేక సర్వే



వివరాలు సేకరిస్తున్న బీజేపీ నాయకులు

మహదేవపుర, జూలై 10(ఆంధ్రజ్యోతి): మహదేవపుర నియోజకవర్గ పరిధిలో బంగ్లాదేశీయులు అక్రమంగా నివసిస్తున్నారనే విమర్శల నేపథ్యంలో బీజేపీ హోబళి నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక అభియాన చేపట్టారు. మాజీ మంత్రి అరవింద లింబావళి, ఎమ్మెల్యే మంజుళాల మార్గదర్శకంలో మహదేవపుర టౌన్ హోబళి బీజేపీ అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి నేతృత్వంలోని బృందం పరిశీలించింది. వర్తూరు వార్డులోని బళగెరె, సూరుణసె తదితర ప్రాంతాలలో అక్రమంగా షెడ్‌లు వేసుకుని ఉంటున్నవారి వివరాలు సేకరించారు. ఆధార్‌కార్డు, ఓటరు గుర్తింపుకార్డు ఇతర వివరాలు సేకరించారు. అనంతరం మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో అక్రమంగా ఉంటున్న విదేశీయులను గుర్తించి వాపసుపంపేందుకు చేపట్టిన చర్యలలో భాగంగా అభియాన చేపట్టామన్నారు.

కొన్ని ప్రదేశాల్లో బంగ్లాదేశీయులు అక్రమంగా ఉంటున్నారనే సమాచారంతో నాలుగు బృందాలుగా ఏర్పడి వారి వివరాలు సేకరిస్తున్నామన్నారు. స్థానికులతో పోలిస్తే తక్కువ జీతానికే బంగ్లాదేశ్‌వాసులు పనిచేస్తున్నట్టు తెలుస్తోందన్నారు. కొందరి వద్ద నకిలీ గుర్తింపు కార్డులు ఉన్నట్టు గుర్తించామన్నారు. అక్రమ బంగ్లాదేశ్ వాసులను గుర్తించి వాపసు పంపడంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కార్యాచరణకు తమవంతు సహకారం అందిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు రాజేశ్, మహేంద్ర మోది, నాగేశ్, రక్షిత్, సత్య, మారప్ప తదితరులు ఉన్నారు.



సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

కిటకిటలాడిన సాయిబాబా ఆలయాలు

రాయచూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : ఆశాఢ శుద్ధ పౌర్ణమిని నగర ప్రజలు గురుపూర్ణిమగా భక్తిశ్రద్ధలతో ఆచరించారు. ప్రత్యేకించి నగరంలోని సాయిబాబా మందిరం వద్ద నిర్వహించిన ధార్మిక కార్యక్రమాల్లో భక్తులు వేల సంఖ్యలో పాల్గొని స్వామి వారి దర్శనం చేసుకున్నారు. స్థానిక శిరడిసాయి సేవా చారిటేబుల్ ట్రస్ట్, ఓం సాయి ధ్యానం మందిరంల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా మహారుద్రాభిషేకం స్వామివారికి లక్షబిల్వార్చన కోటి పుష్పాభిషేకం వంటి ధార్మిక కార్యక్రమాలను సంప్రదాయబద్ధగా నిర్వహించారు. కాగా ఆలయంలో మధ్యాహ్నం నిర్వహించిన ప్రత్యేక హారతి కార్యక్రమంలో పాల్గొన్న సాయి భక్తులు స్థానిక సాయి కిరణ్ ఆదోని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం స్వామి వారికి పల్లక్కి సేవా నిర్వహించి భక్తులు సాయినామా స్మరణతో భజన నిర్వహించారు.

సిరుగుప్పలో..

సిరుగుప్ప (ఆంధ్రజ్యోతి): సిరుగుప్ప తాలుకా వ్యాప్తంగా షిర్డీసాయిబాబా వెలసిన చోటల్లా ఎంతో అలంకార సేవలు చేసి గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు. ప్రధానంగా బళ్లారి రోడ్డు మార్గంలో సాయిబాబా ఆలయంలో ఆయనకు పుష్పాలంకార సేవలు చేసి ప్రసాదాలు పంచిపెట్టారు. పట్టణంలో అయ్యప్పస్వామి ఆలయంలో వెలసిన షిర్డీసాయిబాబాకు పూజలు జరిపి అన్నదాన సేవలు చేపట్టారు.



జ్ఞానభారతిలో గురు పూజోత్సవం



అశోక్‌కుమార్‌రెడ్డిని సత్కరిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

బెంగళూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి): కొండప్ప లే అవుట్‌లోని జ్ఞానభారతి పబ్లిక్ స్కూల్ వ్యవస్థాపకులు అశోక్ కుమార్ రెడ్డిని గురుపూజోత్సవం సందర్భంగా సత్కరించారు. గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు కొండప్ప లేఅవుట్‌కు చెందిన పలువురు సన్మానం చేశారు. జ్ఞానభారతి పాఠశాల ద్వారా ఎంతోమందికి గుణాత్మక విద్యను అందించి భవిష్యత్తును తీర్చారని అశోక్‌కుమార్‌రెడ్డిని కొనియాడారు. పలువురు మాట్లాడుతూ.. మధ్యతరగతి, చేనేతలు నివసించే ప్రాంతంలో ఉత్తమ పాఠశాల ఎంతోమందికి మేలుచేసినట్లు అయ్యిందన్నారు. అశోక్‌కుమార్‌రెడ్డిని సత్కరించిన వారిలో ఎఎస్ రాజా, రామ్మూర్తి, మంజునాథ్, ఫయాజ్, శ్రీనివాసులు, భరత్, కరస్పాండెంట్ యశ్వంత్‌రెడ్డి, గోపాలకృష్ణారెడ్డితో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన మొహర్రం

సిరుగుప్ప, జూలై10(ఆంధ్రజ్యోతి): శాంతియుతంగా మొహర్రం పండుగ వేడుకలు కార్యక్రమాలు పూర్తయిన నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే బీఎం నాగరాజు సౌదాగర్ మసీదులో అన్నదాన సేవా కార్యక్రమాలు చేపట్టారు. సిరుగుప్ప పట్టణం దేశనూరు రోడ్డుమార్గంలో వెలసిన సౌదాగర్ మసీదులో పీర్ల దేవుళ్ల కార్యక్రమాలు పూర్తి కావడంతో ఆయన అన్నదాన సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మొదటగా పీర్లదేవుళ్లను కొలిచారు. మసీదు సభ్యులు ఎమ్మెల్యేకు సన్మానించారు.

గురు బోధనలతో సమాజంలో సామరస్యం

- కైవార క్షేత్ర ధర్మాధికారి డాక్టర్ ఎంఆర్ జయరాం



ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తున్న ధర్మాధికారి డాక్టర్ ఎంఆర్ జయరాం

చింతామణి (ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రజల మధ్య సామరస్యం వెల్లివిరియడానికి గురువు బోధనలు, మార్గదర్శకం అవసరమని కైవార క్షేత్ర ధర్మాధికారి డాక్టర్ ఎంఆర్ జయరాం అభిప్రాయపడ్డారు. కైవార యోగి నారేయణమఠంలో గురుపూర్ణిమను పురస్కరించుకుని గురుపూజా సంగీతోత్సవం ముగింపు కార్యక్రమంలో ఆయన ప్రత్యేక ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. భారత సనాతన పరంపరలో గురుశిష్యులకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. మనలోని చంచల బుద్ధిని, అజ్ఞానాన్ని తొలగించి సన్మార్గంలో నడిపేలా గురువులు మార్గదర్శకం చేస్తారన్నారు. గురుసాక్షాత్కారంతోనే ఆత్మచింతన చేయాలన్నారు. భగవంతుడు ఆర్తితో ప్రార్థించే భక్తుడిని ఎలా రక్షిస్తాడో... ఒక గురువు కూడా శిష్యుడికి అంతటి అండగా ఉంటారన్నారు. కథాశ్రవణం, కీర్తన, నామస్మరణం, పూజ చేయడం ద్వారా భగవంతుడిని సేవించి భక్తులు పావనం కావాలని కైవార తాతయ్య బోధించారన్నారు. గురుపూజోత్సవంలో భాగంగా విద్వాంసులచే గోష్ఠిగాయనం శాస్త్రీయంగా సాగింది. నారేయణతాతయ్యకు అభిషేకం, రాజోపచారాలు, అష్టావధాన సేవ నిర్వహించారు. సరిహద్దులోని ఆంధ్రప్రదేశ్, తమిళనాడు ప్రాంతాల నుంచి కూడా వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు. ఇదే సందర్భంగా కైవార క్షేత్రం ద్వారా ప్రచురితమయ్యే మల్లార మాసపత్రిక 25వ వార్షిక విశేష సంచికను సంపాదకులు డాక్టర్ బాబు కృష్ణమూర్తి ఆవిష్కరించారు. ప్రతిక రచయితలను ఆత్మీయంగా సత్కరించారు. మూడు రోజుల సంగీతోత్సంలో వివిద ప్రాంతాల కళాకారుల సంగీత ప్రదర్శన భక్తులను అలరించింది.



కైవార నారేయణ తాతయ్యకు పూజలు



భజనలో పెద్దసంఖ్యలో పాల్గొన్న భక్తులు

కడప, అనంతపురం మ్యాచ్ డ్రా

- కర్నూలుపై చిత్తూరు జట్టు ఘన విజయం
- కడపలో ఉత్సాహంగా అండర్ 19 క్రికెట్ పోటీలు

కడప స్పోర్ట్స్, జూలై 10(ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్ 19 మెన్స్ మల్టీ డే (మూడు రోజుల) క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా గురువారం రెండు వేర్వేరు జట్ల మధ్య మ్యాచ్‌లు జరిగాయి. ఇందులో కడప, అనంతపురం జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. అలాగే కర్నూలు, చిత్తూరు జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్ లో చిత్తూరు జట్టు 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది.

కేవోఆర్ఎం మైదానంలో...

కడప నగర శివారు ప్రాంతం కేవోఆర్ఎం మైదానంలో కడప, అనంతపురం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేపట్టిన కడప జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో 93.2 ఓవర్లలో 495 పరుగులకు ఆలౌట్ అయ్యింది. తదుపరి బ్యాటింగ్ దిగిన అనంతపురం జట్టు 67 ఓవర్లలో 250 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. దీంతో కడప జట్టుకు 245 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌కు దిగిన కడప జట్టు మూడో రోజు ఆట ముగిసే సమయానికి 107 ఓవర్లలో 9 వికెట్లను కోల్పోయి 455 పరుగులు చేసింది. ఇందులో రోహిత్ వర్మ 133, ఆర్జిత్‌రెడ్డి 111 పరుగులు చేసి నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. దీంతో నిర్వాహకులు మ్యాచ్ డ్రాగా ముగిసినట్లు వెల్లడించారు.

ఏసీఏ మైదానంలో..

నగర రిమ్స్ సమీప వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో చిత్తూరు-కర్నూలు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో మొదట కర్నూలు జట్టు బ్యాటింగ్ చేపట్టి తన మొదటి ఇన్నింగ్స్‌లో 77.4 ఓవర్లలో 282 పరుగులకు ఆలౌట్ కాగా, తదుపరి బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 63.4 ఓవర్లలో 251 పరుగులకు ఆలౌట్ అయ్యింది. దీంతో కర్నూలు జట్టుకు 31 పరుగుల ఆధిక్యత లభించింది. అనంతరం రెండోరోజు కర్నూలు జట్టు 71.2 ఓవర్లలో 272 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో మొత్తం రెండు ఇన్నింగ్స్‌లకు కలిపి 303 పరుగులు ఆధిక్యత సాధించింది. ఇందులో హృదయ్ 85, విఖ్యాత్ 85 పరుగులు చేశారు. అనంతరం మూడోరోజు గురువారం రెండో ఇన్నింగ్స్‌కు దిగిన చిత్తూరు జట్టు 42.2 ఓవర్లలో కేవలం మూడు వికెట్లు మాత్రమే కోల్పోయి విజయానికి అవసరమైన 304 పరుగులు సాధించి జయకేతనం ఎగురవేశారు. ఇందులో లోహిత్ లక్ష్మీనారాయణ 138 పరుగులు సాధించారు. దీంతో చిత్తూరు జట్టు 7 వికెట్ల తేడాతో విజయభేరి మోగించింది.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1624.83	1,602.67
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	46,955	27.544
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	45,492	199
నీటి నిల్వ (టీఎంసీలు)	75.93	25.17

పిల్లలకు సంస్కారం నేర్పాలి

● రిటైర్డ్ ప్రిన్సిపాల్ అరవింద్ కులకర్ణి

హోస్పేట, జూలై 10(ఆంధ్రజ్యోతి):ఇంట్లోనే సంస్కృతి ప్రారంభం కావాలని, తల్లి పిల్లలకు సంస్కారం నేర్పాలని రిటైర్డ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అరవింద్ కులకర్ణి అన్నారు. గురువారం నగరంలోని ఫ్రీడమ్‌పార్క్ లక్ష పతాంజలి యోగా సమితి జనని వివిధోదేశ సహకారి సంఘ్ సహకారంతో నిర్వహించిన గురు పూర్ణిమ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముందుగా పతంజలి మహర్షి చిత్రపటానికి పూల మాలలు వేసి, నివాళులర్పించారు. పిల్లలు సంస్కారవంతులైతేనే సామరస్య సమాజం సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ యోగా సాధకులు సత్యప్ప, శివమూర్తి, నీటిపారుదల శాఖ అసిస్టెంట్ ఏఈ మంజునాథ్, పార్క్ కన్వీనర్ అనంత్‌జోషి, తదితరులుపాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

హోస్పేట, జూలై10(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రాష్ట్రప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ శ్రుతికి వినతి పత్రం అందజేశారు. పెన్షనర్లకు సాయంత్రం భోజన పథకం, కేంద్రం లాగా సీజే చెస్ పథకం, కేరళ కార్మికులకు నగదు రహిత పథకం వంటి అనేక డిమాండ్ల పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఆసంఘం నాయకులు బిసాటి తాయప్పనాయక్, సునీతా అన్వాకర్, నాగరాజ్ పట్వారా, కే లింగప్ప పాల్గొన్నారు.

అవసరాలకు అనుగుణంగానే

నీరు విడుదల చేయాలి

రైతు సంఘం నాయకుల వినతి



వాయనం సమర్పిస్తున్న బీవీ గౌడ్

కంప్లి, జూలై10(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయం నుంచి కుడి ఎడమ ప్రధాన కాలువలకు రైతులకు అనుగుణంగానే నీరు వదలాలని రైతు సంఘం హసురుసేన జిల్లా అధ్యక్షుడు బివిగౌడ కోరారు.. కంప్లి కోటట తుంగభద్ర నదిలో రైతు సంఘం ఆధ్వర్యంలో వాయనం వదిలారు. ఈ సందర్భంగా బీవీగౌడ మాట్లాడుతూ.. ఈసారి ముందుగానే తుంగభద్ర జలాశయం నిండడం హర్షణీయమన్నారు. ఖరీఫ్ పంటతోపాటు రబీ పంట కూడా నీరు వదలాలని అన్నారు. అక్టోబరు, నవంబరు నెలల వరకు జలాశయంలో 80 టీఎంసీలు నిల్వ వుండేలా అధికారులు జాగ్రత్త వహించాలి. జనవరి, ఫిబ్రవరిలో ఆ నీటిని రబీ పంటకు ఉపయోగించుకునేలా చూసుకోవాలన్నారు. జలాశయంలో 40 టీఎంసీలు వుంచుకుని క్రస్ట్ గేట్లు పనులు చేపట్టుకోవాలని సూచించారు. త్వరగానే ఉప కాలువలకు ఇండెంట్ జారీ చేసి నాట్లు వేసుకునేందుకు చిన్ననీటిపారుదల అధికారులు ముందుకురావాలని సూచించారు. కార్యక్రమంలో హేమయ్యస్వామి, శశికళ, తిమ్మపప్ప, వీరేష్, మాధవరెడ్డి, రుద్రప్ప, పాండు, గంగన్న, కొట్టూరు రమేష్ సుదర్శన్ మురారి ఆదోని రంగప్ప రైతులు నాయకులు పాల్గొన్నారు.



కంప్లిలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గణేష్



ఎంజీ రోడ్డులోని విశాలనగర్‌లో..



పటేల్ నగర్‌లో..



ప్రసాదాల పంపిణీలో ఆలయ కమిటీ సభ్యులు

మార్మోగిన సాయినామం

బళ్లారి సిటీ, జూలై 10(ఆంధ్రజ్యోతి): ఉభయ జిల్లాల్లో గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. దత్తాత్రేయుడు, బాబా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు సాయినామస్మరనతో పూజలు నిర్వహించారు. గురువారం కోట ప్రాంతంలో వెలసిన షిరిడీ సాయిబాబ ఆలయంలో గురుపౌర్ణిమి పురస్కరించుకుని ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా బళ్లారినగరంలోని కమలజ్యువెలర్స్, మిత్రబృందంతో కలిసి వేలాది మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈసందర్భంగా గోల్డ్ శ్రీనివాస్ మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా అన్నదానాన్ని నిర్వహిస్తున్నామన్నారు. వ్యాపారంలో వచ్చిన లాభాల్లో ఎంతోకొంత సేవా కార్యక్రమాలకు ఉపయోగించాలన్నదే తమ ఉద్దేశమన్నారు. ప్రతి గురువారం బాబా ఆలయం వద్ద అమవాస్యతదితర రోజులల్లో విమ్స్ ఆసుపత్రిలో అన్నదానం, పేదలకు తాళిబొట్టు ఉచితంగా అందజేస్తూ బంగారు శ్రీనివాసులుగా పేరుగడించారు.

ఈకార్యక్రమంలో శ్రీనివాస్ కటుంబ సభ్యులతో పాటు నగరానికి చెందిన ప్రముఖులు, చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు చిట్టూరి శ్రీనివాస్‌రావు, ప్రస్తుతం అధ్యక్షుడు యశ్వంత్‌రాజ్ నాగిరెడ్డి, కార్యదర్శి కేసీ బాబు, తుంగభద్ర సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ సెక్రటరీ ఎం.ఆర్. ప్రసాద్, సత్యబాబు, ఏపీఎంసీ శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఇదే సందర్భంలో శ్రీసాయిబాబు చిన్న విగ్రాహాలను మహిళా భక్తులకు అందించారు.

● నగరంలోని ఎంజీ రోడ్డులో వెలసిన సాయిబాబా ఆలయంలో 16వవార్షికోత్సం అత్యంత ఘనంగా నిర్వహించారు. బాబాను ప్రత్యేక అలంకరణలో అలంకరించారు,నగరంలోని పటేల్‌నగర్ బాబా ఆలయంలో ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. బాబా దర్శానానికి విచ్చేసిన భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయాల్లో సాయి నామస్మరణ మార్మోగింది.

● గురుపూర్ణిమ సందర్భంగా నగరంలోని కల్యాణ స్వామి మఠంలో భక్తులతో సామూహిక సూర్య నమస్కారాలు, అగ్నిహోత్ర హోమపూజలో పాటు ప్రత్యేక ధార్మిక కార్యక్రమాలు జరిగాయి. మేయర్ ముల్లంగి నందీశ్ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు,

కంప్లి,(ఆంధ్రజ్యోతి): గురుపౌర్ణమి సందర్భంగా కంప్లి పట్టణంలోని సాయిబాబా ఆలయంలో ఎమ్మెల్యే గణేష్ ప్రత్యేకపూజలు నిర్వహించారు.. ఆలయ కమిటీ ఎమ్మెల్యేకు సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రత్యేక గురుపౌర్ణమి సందర్భంగా తన ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టుకుంటున్నామని తెలుపుతున్నారు. ఇలాంటి ధార్మిక కార్యక్రమాల వల్లే పట్టణాలు, ప్రశాంతంగా నెలకొంటుందని తెలిపారు.పంచాయతీ స్థాయి సమితి అధ్యక్షులు, రాజశేఖర్, కౌన్సిలర్ వెంకట రమణ బాబు తదితరులు బాబాకు ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. వారికి కమిటీవారు సన్మానించారు. ఉదయం నుండి సాయంత్రం వరకు బాబా ఆలయంలో వివిధ ధార్మిక సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయని తెలిపారు.



సాయిబాబా సన్నిధిలో బంగారు శ్రీనివాస్

పురోహితులు శ్రీనివాస్, పాండు తదితరులు పూజలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు కమిటీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



కుడితినిలో పంచాయతీ అధ్యక్షుడు రాజశేఖర్

విద్యుత్ కోతలపై రైతుల నిరసన



నిరసనలో అఖిల భారత్ కిసాన్ సంఘర్ష సమితి సభ్యులు

బళ్లారి సిటీ, జూలై 10(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని హరగిణ డొనె గ్రామంలో రైతుల పంపుసెట్లకు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు 400ఓల్టేజి విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత్ కిసాన్ సంఘర్ష సమితి నేతృత్వంలో గురువారం నగరంలో నిరసన చేపట్టింది. గ్రామీణ సబ్-డివిజన్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మెహన్‌బాబకు వినతి పత్రం సమర్పించారు. దీనిపై స్పందించిన అధికారులు 400ఓల్టేజ్ విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈసందర్భంగా అధ్యక్షుడు గోవింద్ మాట్లాడుతూ తుంగభద్ర నది కాలువ ద్వారా తాలూకాలో సగం భూమి నీటి సరఫరాలో ఉన్నా, హరగిణ డొనె గ్రామ చుట్టుపక్కల వర్షం పైనే ఆధారపడాల్సి వస్తుందన్నారు. అటువంటి ప్రాంతాల్లోని రైతులు బోర్ బావులతో పంటలు పండిస్తూ కష్టపడి పనిచేస్తున్నారు. అయితే పంపుసెట్ల ద్వారా నీటిని పొందడానికి అవసరమైన విద్యుత్ అందుబాటులో లేకపోతే వారి శ్రమ వృథా అవుతుంది అని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాకార్యదర్శి గురల్లి రాజా మాట్లాడుతూ ఈ ప్రాంతం ఆటవీ ప్రాంతానికి దగ్గరగాఉంది. సాయంత్రం ఎలుగుబంట్లు, పాములు, చిరుతలు పొలాల్లోకి ప్రవేశించే అవకాశం ఉందని, రాత్రి కరెంట్‌తో ఇబ్బంది పడుతున్నామన్నారు. ఈ ప్రాంతానికి ఒక లైన్‌మెన్‌ను మాత్రమే నియమించారు. ఇతర సమస్యలు తలెత్తినప్పుడు ఇబ్బందిగా మారాయన్నారు. నిరసనలో సంఘం తాలూకా అధ్యక్షుడు సిద్దలింగ,వీరేశ్‌రైతు నాయకులు చంద్ర, బసవనగౌడ, శివరామరెడ్డి, బుగ్గేశ్, జంబయ్య, శివరాజ్. దొడ్డబసప్ప, యంకారెడ్డి, ఓబలేశ్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం.. ప్రాణదానంతో సమానం

● ఆరోగ్య శాఖాధికారి చెన్నబసవరాజు



రక్తదానం చేస్తున్న స్థానికులు

కంప్లి, జూలై 10(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేసి గొప్పతనం కన్నా మరేదీ లేదని ఆరోగ్యశాఖాధికారి చెన్నబసవ రాజు తెలిపారు. కంప్లి పట్టణంలో గురువారం ఆరోగ్యశాఖ స్వామి వివేకానంద బ్లడ్‌బ్యాంకు ఆశా కార్యకర్తల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్న బసవరాజు మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకు రక్తదానం చేయడం వల్ల ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చు. అనారోగ్యానికి దూరమవుతున్నా రన్నారు. యువకులు చెడు అలవాట్లకు దూరంగా వుండి ఇలా ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేపట్టి గొప్పవాడిగా ఎదగాలని సూచించారు. 60 మంది రక్తదానం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు, ఆరోగ్యశాఖ సిబ్బంది స్వామి వివేకానంద బ్లడ్ బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగుడికి పింఛన్ అందజేత



చెక్కు అందజేస్తున్న కార్పొరేటర్ హనుమంతప్ప

బళ్లారిరూరల్, జూలై10(ఆంధ్రజ్యోతి): నగరంలోని 22వ వార్డు సమీపంలో ఉన్న కనుచూపులేని దివ్యాంగుడికి ధర్మస్థళ సంఘం ఆధ్వర్యంలో ప్రతి నెలా వెయ్యి రూపాయల చొప్పున అందేలా చెక్కును అందజేశారు. ధర్మస్థళ సంఘం స్థాపించిన వీరేంద్ర హెగ్డే ధర్మస్థల గ్రామీణాభివృద్ధి సంస్థ పేద ప్రజలకు తక్కువ రేటు వడ్డీతో మహిళలకు రుణాలు అందించడమే కాకుండా అనాథ వద్ధులకు, దివ్యాంగులకు సంస్థ ఆధ్వర్యంలో పేదలకు విద్య ఆర్థిక సహాయం దేవాలయ నిర్మాణానికి ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు ట్రస్టు సభ్యులు సంజీవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మస్థళ సంఘం సభ్యులు సంజీవ్, ఆశ, వార్డు కార్పొరేటర్ హనుమంతప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆరు నెలల వేతనాలు ఇప్పించండి సార్..

● ఎమ్మెల్యేకు ఉపాధి సిబ్బంది వినతి



ఎమ్మెల్యే గణేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధి ఉద్యోగులు

కంప్లి, జూలై 10(ఆంధ్రజ్యోతి): తాలుకా పంచాయతీ నరేగా కింద విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి గత ఆరు నెలలుగా వేతనాలు ఇవ్వలేదంటూ కర్ణాటక రాష్ట్రం మహాత్మాగాంధీ నరేగా పథకం జిల్లా క్షమాభివృద్ధి సంఘటన కార్యదర్శి హనుమేష్ తెలిపారు. గురువారం కంప్లి పట్టణంలో ఎమ్మెల్యే కు మనవిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా హనుమేష్ మాట్లాడుతూ ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని విధులు సక్రమంగా నిర్వహించి తాము గుర్తింపు పొందామన్నారు. కానీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం నరేగా సిబ్బందిపై నిర్లక్ష్యం వహించిందని తెలిపారు. గత ఆరు నెలలుగా జీతాలు రాక ఇళ్లలో గడిచేందుకే కష్టంగా మారిందన్నారు. పొరుగువారితో అప్పులు తీసుకుని కుటుంబాన్ని గడుపుతున్నామని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ నరేగా సంబంధించిన మంత్రులతో చర్చించి తమకు న్యాయం చేకూరుస్తామని హామీ ఇచ్చారు. ఒక న్యాయం లభించే వరకు తమకు వేతనాలు ఇచ్చేవరకు నిరసన తప్పని నౌకరులు తెలిపారు. ఎస్ఆర్‌ఈజీపీ ఉద్యోగుల జిల్లా ప్రధాన కార్యదర్శి సంగమేష్, మల్లికార్జున, టీఐఈసీ చంద్రశేఖర్, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు బీ సిద్దేశ్వర టెక్నికల్ అసిస్టెంట్లు అరుణజ్యోతి, లోకేష్, తిప్పేష్, లోకేష్, బసవరాజు, ఆంజనేయ, బీఎఫ్‌టీ, చెన్నవీర, మారేష్, హనుమంత, జీకేఎంలు, శిల్ప, వన్నూరమ్మ, మంజుళ, రంజని పాల్గొన్నారు.

వచన సాహిత్యంతో వివక్షను తొలగించిన హడపద అప్పన్న

జిల్లా పథకాల అమలు కమిటీ చైర్మన్ చిదానందప్ప

బళ్లారి సిటీ, జూలై 10(ఆంధ్రజ్యోతి): 12వ శతాబ్దంలో మార్గదర్శకుల్లో ఒకరైన శివశరణ హడపద అప్పన్న తన వచనాల ద్వారా సమాజంలో వివక్షతను తొలగించారని జిల్లా హామీ పథకాల అమలు అథారిటీ ఛైర్మన్ కేఈ చిదానందప్ప అన్నారు. నగరంలోని జోళదరాశి దొడ్డనగౌడ రంగమందిరంలో గురువారం జిల్లా యంత్రాంగం, జిల్లాపంచాయతీ, కన్నడ సాంస్కృతిక శాఖ, మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శివశరణ హడపద అప్పన్న జయంతి కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. హడపద అప్పన్నను బసవన్న కుడిభుజం అని అనేవారు. కళ్యాణక్రాంతి చివరి రోజులను పరిశీలిస్తే అప్పన్న బసవన్న ఆత్మ అని అన్నారు. అప్పన్న ప్రియ చన్నబసవన్న అనే కలం పేరుతో 250కి పైగా వచనాలను తాను రచించారన్నారు. అతని బార్య లింగమ్మ కూడా గొప్ప వచనగార్తి, అమె స్వస్థలం విజయపుర జిల్లాలోని తంగడ్గి అక్కడ ఆమె సమాధి కూడా ఉందన్నారు. రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు కొట్రప్ప మాట్లాడుతూ బసవన్న బాల్య స్నేహితుడు అప్పన్న, ప్రపంచంలోని మొట్టమొదటి ప్రజాస్వామ్య పార్లమెంట్‌గా పిలువబడే అనుభవ మంటప లో బసవన్నకే ప్రధాన కార్యదర్శిగా పనిచేశారన్నారు. విజయపుర బసవనబాగేవాడి తాలూకాలోని మాసబినాల్ గ్రామంలో తండ్రి చెన్నవీరప్ప, తల్లిదేవకమ్మ దంపతులకు హడపద అప్పన్న జన్మించారు. అతని కాలం క్రీ.శ . 1160 గా గుర్తించబడింది. ఈసందర్భంగా శివలింగ శివాచార్య జంగం హొసళ్ళి, కన్నడ సాంస్కృతిక వాఖ సహాయ సంచాలకులు బి.నాగరాజ్, జిల్లా హడపద అప్పన్న సేవాసమితి సదాశివతోపాటు సంఘం నాయకులు, ప్రజాప్రతినిధులు, అప్పన్న సేవాసమితి అధ్యక్షుడు మంజునాథ్, బళ్లారి తాలూకా అధ్యక్షుడు సదాశివ పాల్గొన్నారు. అప్పన్న జయంతి ఉత్సవాల్లో భాగంగా నగరంలో ఉత్సవ ఊరేగింపు ఘనంగా జరిగింది. ఈ ఊరేగింపులో వివిధ సాంస్కృతిక బృందాలు అందరి దృష్టిని ఆకట్టుకున్నాయి.



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న చిదానందప్ప

హోసూరు జోన్

వీధికుక్క దాడులపై సమాచారానికి హెల్ప్‌లైన్

ప్రత్యేక సమావేశంలో ఆరోగ్యశాఖ అధికారుల నిర్ణయం



సమావేశంలో ఆరోగ్యస్థాయి కమిటీ చైర్మన్ మాదేశ్వరన్

హోసూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి): నగరంలో ఇటీవల వీధికుక్కల దాడికి గురవుతున్న బాధితులు పెరుగుతున్న తరుణంలో కార్పొరేషన్ అధికారులు తీవ్రంగా పరిగణించారు. ఆరోగ్య స్థాయి కమిటీ మాదేశ్వరన్ అధ్యక్షతన గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వీధికుక్కల దాడి బాధితులు హెల్ప్‌లైన్‌కు ఫోన్‌చేసేలా చర్యలు చేపట్టదలిచారు. పాఠశాల సమీపాన గుట్కా, పొగాకు ఉత్పత్తులు విక్రయించకుండా ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలని సూచించారు. వర్షాకాల సీజన్‌లో దోమలబెడద తలెత్తకుండా ముందస్తు చర్యలకు అధికారులకు పలు సలహా సూచనలు చేశారు. అనంతరం మాదేశ్వరన్ మీడియాతో మాట్లాడుతూ కుక్కకాటుకు గురవుతున్నవారి సంఖ్య పెరుగుతోందని, వారు చికిత్సలు పొందుతున్నారా లేదా ఇతరత్రా సమాచారం నమోదు చేయాలని హెల్త్ వర్కర్లకు సూచించినట్టు తెలిపారు. కుక్కకాటుకు గురైన బాధితుల సమాచారాన్ని 9489909828కు తెలపాలన్నారు.

కుక్కకాటుతో ప్రైవేట్ ఉద్యోగి మృతి

హోసూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి): హోసూరులో వీధికుక్కదాడిలో ప్రైవేట్ కంపెనీ ఉద్యోగి మృతి చెందాడు. సమీపంలోని కుపట్టి పంచాయతీ తిన్నూరు గ్రామానికి చెందిన విక్టర్‌బాబు, ఆంటోనియమ్మాల్‌ల కుమారుడు ఎడ్విన్ ప్రియన్ (23) ఎంబీఏ చేసి తళి సమీపంలోని ప్రైవేట్ సంస్థలో పనిచేస్తున్నాడు. ఇటీవల అతడికి కుక్క కరిచినా నిర్లక్ష్యం చేశాడు. బుధవారం అతడి శరీరంలో తీవ్ర మార్పులు రావడంతో వెంటనే అతడిని స్థానిక కుక్కదాసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. బిగ్గరగా అరస్తుండడంతో ప్రాథమిక చికిత్స అనంతరం ప్రైవేట్ ఆసుపత్రికి మార్చు చేశారు. కుక్క కరిచినట్టు గుర్తించి రాబిస్ వ్యాక్సిన్ ఇచ్చారు. అనంతరం రాత్రికి హోసూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం అతను ఎలాంటి అరుపులు చేయకుండా నిద్రపోయాడు. కొద్దిసేపటి తర్వాత అతను మృతి చెందాడు. దీంతో ఎడ్విన్ కుటుంబంలో విషాదం నెలకొంది.



ఎడ్విన్ ప్రియన్ (ఫైల్)

చన్నరాయస్వామి ఆలయంలో ఉత్సవమూర్తుల ప్రతిష్ఠ

హోసూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి): పెరిగై సమీపంలోని తట్టనపల్లిలో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత చన్నరాయస్వామి ఆలయంలో నూతన ఉత్సవమూర్తులను ప్రతిష్ఠించారు. వేదాంత దేశికర్ నేతృత్వంలో ధార్మిక కార్యక్రమాలు సాగాయి. ఇదే సందర్భంగా పెద్ద తిరువడి, చిన్న తిరువడి అని పిలవబడే హనుమంతుడి, గరుడాళ్వార్ ఉత్సవమూర్తులను కూడా ప్రతిష్ఠించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



ఉత్సవమూర్తులను తీసుకువస్తున్న పండితులు

రాయచూరు మహానగర పాలికె అధ్యక్షుడిగా సాజిద్ సమీర్

రాయచూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి): రాయచూరు మహానగర పాలిక ఇన్‌చార్జ్ అధ్యక్షుడిగా ప్రస్తుత ఉపాధ్యక్షుడు సాజిద్ సమీర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. నగర పాలిక అధ్యక్షురాలిగా విధులు నిర్వహిస్తున్న నరసమ్మ మాడగిరి అనారోగ్య కారణాలతో సెలువు తీసుకున్నట్లు ప్రకటించగా నిబంధనల మేరకు తాత్కాలిక అధ్యక్ష బాధ్యతలను ఉపాధ్యక్షుడైన సాజిద్ సమీర్ స్వీకరించారు. ఈ సందర్భంగా సాజిద్ సమీర్ మాట్లాడుతూ, నిబంధనల మేరకు అధ్యక్షుడు సెవులులో ఉన్నప్పుడు ఉపాధ్యక్షుడికి తాత్కాలిక బాధ్యతలు అప్పగిస్తారని ఇందులో ఎలాంటి రాజకీయాలు లేవన్నారు. తాను అధ్యక్ష స్థానంలో ఉండి నగరాభివృద్ధి కోసం నిబద్ధతతో కృషి చేస్తానన్నారు. రాయచూరు నగరసభ అప్‌గ్రేడేషన్ తర్వాతా అనేక అభివృద్ధి సనులు వేగవంతంగా సాగుతున్నట్లు ఆయన తెలిపారు. చారిత్రక కోట అభివృద్ధితో పాటు వర్షకాలం ఆరంభమైనందున కందకాన్ని స్వచ్చం చేసే పనులు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. వీటితో పాటు నగరంలో వీధి కుక్కల నియంత్రణను విడి పశువుల అడ్డగోలు సంచారాన్ని నియంత్రించేందుకు ప్రత్యేక కార్యచరణ చేపట్టినట్లు ఆయన వివరించారు. కాగా ఉపాధ్యక్షుడిగా ఉన్న సాజిద్ సమీర్ తాత్కాలిక అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీరిస్తున్న సందర్భంగా ఆయన మద్దతుదారులు సంబరం జరుపుకున్నారు.



సమీర్‌ను సత్కరిస్తున్న అభిమానులు

జపానంద కంటి ఆసుపత్రికి నోటీసులు

పావగడ, జూలై 10(ఆంధ్రజ్యోతి): శారదాదేవి కంటి ఆసుపత్రిలో జపానంద స్వామి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కంటి చికిత్సల్లో భాగంగా 7న ఆరుగురు వృద్ధులకు ఆపరేషన్ చేయగా చూపు కోల్పోయిన ఘటనపై ఆస్పత్రికి నోటులు ఇచ్చారు. జిల్లా, రాష్ట్రస్థాయి వైద్యులు 14న ఆసుపత్రిని తనిఖీ చేయనున్నారని జిల్లా వైద్యాధికారి డా.చంద్రశేఖర్ తెలిపారు. ఉచిత కంటి ఆపరేషన్ పేరుతో అనుభవంలేని వైద్యులతో ఆపరేషన్ చేయిస్తే వాటికి నాణ్యతలేని లెన్స్ అమర్చడంతో కంటిచూపు పోయిందని బాధితులు వాపోయారు.

ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్లు పూర్తి

పావగడ, జూలై 10(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సిద్దరామయ్య 21వ తేదీ పావగడలో పర్యటిస్తున్న సందర్భంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ సత్యవాణి తెలిపారు. గురువారం ఆమె సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభానికి ముఖ్యమంత్రి రానున్న సందర్భంగా అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. తుంగభద్ర జలాలు, తాగునీటి కోసం జేజేఎం పథకం కింద కొళాయిలు అమర్చిన విషయంపై చర్చించారు.

పాఠశాలలో విద్యాసామగ్రి పంపిణీ

బళ్లారి సిటీ, జూలై 10(ఆంధ్రజ్యోతి): బళ్లారి సేవా సమితి ఆధ్వర్యంలో కప్పగల్లు గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం విద్యాసామాగ్రి పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో బళ్లారి జిల్లాపోలీస్ సూపరింటెండెంట్ శోభారాణి, బీడీడీసీఐ అధ్యక్షుడు యశ్వంత్‌రాజ్ నాగిరెడ్డి, నారాయణ్ నాయకత్వంలో విద్యార్థులకు విద్యా సామాగ్రిని అందజేశారు. తరువాత బళ్లారి జిల్లా పోలీసు సూపరింటెండెంట్ శోభారాణి మాట్లాడుతూ ఈ విద్యా సహాయం గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు స్ఫూర్తినిస్తుందని, వారు మెరుగైన విద్య వైపు వెళ్లడానికి సహాయపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 250 మందికి పైగా విద్యార్థులకు నోట్‌బుక్‌లు, పెన్నులు తదితర సామాగ్రిని ఉచితంగా పంపిణీ చేశారు. బళ్లారి సేవా సమితి అధ్యక్షుడు సురేంద్రకుమార్ బపన్, కార్యదర్శి రామచంద్ర, జయప్రకాశ్ గుప్తా, స్పాంజ్‌ఐరన్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ రావు, ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పాల్గొన్నారు.



విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేస్తున్న ఎస్పీ శోభారాణి